ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం fb.com/vaartha

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-12-2024 ఆదివారం సంపుటి: 30 సంచిక: 310 పేజీలు: 8+16 వెల: 8.00

బంగ్లాలో మరో ఇస్కాన్ మందిరంపై దాడులు
21న ప్రపంచ ధ్యాన దినోత్సవం
2

## తెలంగాణలో మార్పు బిజెపితోనే..

### పవర్‌లోకి రావడం పక్కా

**హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోన్న కాంగ్రెస్**

**బిజెపి భారీ బహిరంగ సభలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా**

హాజరైన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్



శనివారం హైదరాబాద్‌లో బిజెపి భారీ బహిరంగ సభలో అభివాదం చేస్తున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 7 ప్రభాతవార్త:** తెలంగాణలో మార్పు బిజెపితోతోనే సాధ్యమవుతుందని, వచ్చే ఎన్నికలలో అధికారంలోకి కాషాయం జెండా ఎగరడం ఖాయం అని బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా అన్నారు. కాంగ్రెస్ యేడాది పాలన వైఫల్యాలపై శనివారం సరూర్‌నగర్‌లో బిజెపి రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, ఎంపిలు ఈటల రాజేందర్, >>2



నల్లగొండలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సిఎం భట్టి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

## 'మూసీ' ప్రాజెక్టుతో కాలుష్య విముక్తి

### యుద్ధప్రాతిపదికన ఉమ్మడి నల్గొండ జిల్లా సాగునీటి సరఫరా పనులు

**కెసిఆర్ అసెంబ్లీకి రావాలి.. ఆయన అనుభవాలు తెలంగాణ కోసం వినియోగించాలి**

**సంక్రాంతి తర్వాత రైతు భరోసా డబ్బులు జమ**

**'యాదాద్రి పవర్'కు పర్యావరణ అనుమతులు సాధించాం**

**వచ్చేనెల ఎస్‌ఎల్‌బిసి పనులు ప్రారంభం.. రెండేళ్లలో పూర్తి**

**నల్గొండ జిల్లా బహిరంగ సభలో సిఎం రేవంత్**

**నల్గొండ ప్రతినిధి ప్రభాతవార్త డిసెంబర్ 7:** మూసీ నది పునర్జీవ ప్రాజెక్టును నిర్మించి నల్గొండ జిల్లా వాసులకు పారిశ్రామిక వ్యర్థాలు, కాలుష్యం నుంచి విముక్తి కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాలలో భాగంగా శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎస్.ఎల్.బీ.సి. వద్ద రాజీవ్ ప్రాంగణంలో నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మాత్యులు తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మంత్రి వర్గ సహచరులు, విప్ బీర్లా ఐలయ్య, ఎంపీలు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది.పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవా నికి నల్గొండ జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికు ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, నల్గొండ పోలీస్ కమీషనర్ శరత్ చంద్ర పవార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలి కారు. నార్కెట్ పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెంలకు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గ సహచరులతో >>2

## తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు కెసిఆర్‌కు ఆహ్వానం

**ఫాంహౌస్‌లో పత్రిక స్వయంగా అందజేసిన మంత్రి పొన్నం**



శనివారం ఎర్రవల్లి ఫాంహౌస్‌లో మాజీ సిఎం కెసిఆర్‌కు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న మంత్రి పొన్నం

**మర్కుక్, డిసెంబరు 7 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన తెలంగాణ రాష్ట్ర రాజధాని హైద్రాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత కల్వ కుంట్ల చంద్రశేఖర్‌రావును రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరుతూ ఆహ్వాన పత్రిక అందజేశారు. శనివారం మండల పరిధి లోని ఎర్రవల్లిలో గల కెసిఆర్ నివాసానికి మంత్రి పొన్నం ప్రభాకర్ చేరుకోగా మాజీ ఎంపి జోగినపల్లి సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు >>2

**తెలంగాణ తల్లి విగ్రహా రూపం మార్పుపై హైకోర్టులో పిటిషన్** 7



### ఐదేళ్లలో మహిళలకు లక్ష కోట్ల రుణాలు

**చాంబర్స్ ఆఫ్ కామర్స్ ఎగ్జిబిషన్‌లో డి. సిఎం భట్టి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు7:** మహిళలను ఆర్థికంగా అభి వృద్ధి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ఏడాదికి 20 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు ఇప్పించి వ్యాపారాలు చేసుకోవడానికి ప్రోత్సహిస్తున్నామన్నారు, మహిళలు ఆర్థికంగా నిలదుక్కోవాలని రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఐదు సంవత్సరాల కాలంలో లక్ష కోట్ల రుణాలు వడ్డీ లేకుండా ఇప్పించి వ్యాపార పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామన్నారు. టూరిజం ప్లాజాలో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ కార్య క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి >>2

**ఇఎంఐలు కట్టలేమంటున్న బాధితులు**

**పెను సవాలుగా హైడ్రా ఇళ్ల కూల్చివేత**

## బ్యాంకులపై రూ.10 వేల కోట్ల రుణ భారం



**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** ఇళ్లను కూల్చివేస్తున్న హైడ్రా వ్యవహారం బ్యాంకులకు పెను సవాలుగా మారాయి. హైడ్రా కూల్చివేతల వల్ల హోమ్‌లోన్స్ ఇచ్చిన బ్యాంక్‌లు నష్టపోయే పరిస్థితి ఎదురవుతోంది. ఇళ్లే లేనప్పుడు ఇంటి నిమిత్తం తీసుకున్న రుణాలు ఎలాగ, ఎందుకు కట్టాలని బాధితులు ప్రశ్నిస్తున్నారు. హైడ్రా కూల్చివేతలతో బ్యాంకులపై దాదాపు 10 వేల కోట్లరుణభారం పడిందనిఅంచనా.తెలంగాణలో హైడ్రా కూల్చివేతలు కొన్నినెలలనుంచి కలకలం రేపుతున్నాయి. >>2






భూదాన్‌పోచంపల్లి మండలంలో ప్రమాదానికి గురైన కారు

**చెరువులోకి దూసుకెళ్లిన కారు**

## ఐదుగురు జలసమాధి

### బయటపడిన మరో యువకుడు

**యాదాద్రి జిల్లాలో ఘోరం**

**భూదాన్‌పోచంపల్లి, ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్పూరం గ్రామంలో శనివారం తెల్లవారుజామున తీవ్ర విషాధం చోటుచేసుకుంది. కారు అదుపుతప్పి చెరువులోకి తీసుకెళ్ళడంతో ఐదుగురు యువకులు మృతిచెందారు. అదేవిధంగా మరో యువకుడు కారు అద్దాలు పగలకొట్టి బయటపడి ఈదుకుంటూ ఒడ్డుకు చేరాడు. మృతులను హైద్రాబాద్‌లోని ఎల్బీనగర్ >>2

**కాకినాడలో తీగలాగితే.. తెలంగాణలో**

## కదిలిన డొంక

### 13 మంది రైస్ మిల్లర్లపై ఎపి సిట్ నజర్



**హైదరాబాద్,డిసెంబరు 7,ప్రభాతవార్త:** కాకినాడ పోర్టు కేంద్రంగా రేషన్ బియ్యం దందా తెలంగాణలో ప్రకంపనలు మొదలైంది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కాకినాడా పోర్టు బియ్యం తనిఖీ సందర్భంగా తెలంగాణకు చెందిన 17 మంది రైసుమిల్లర్లు కూడా బియ్యం అక్రమరవాణా మాఫియాలో ఉన్నట్లు వెలుగులోకి వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో వారిని కూడా కేసు పరిధిలోకి తీసుకొని వచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఏపీ సిట్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. పొరుగు రాష్ట్రంకు చెందిన బియ్యం అక్రమ రవాణాదారులతో చేతులు కలిపి ఆదిలాబాద్,కరీంనగర్, వరంగల్ మహబూబ్‌నగర్, సూర్యాపేట, నల్లగొండ, పెద్దపల్లి జిల్లాల నుంచి కాకినాడ ఓడరేవు వరకు అధికారులతో కలిసి బియ్యం అక్రవ రవాణా చేయడం రివాజుగా మారింది.తెలంగాణలో రేషన్‌బియ్యం దందా యథేచ్ఛగాసాగుతోంది. ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు నిఘా పెట్టినా అక్రమ రవాణాకు కళ్ళెం పడటంలేదు. అధికారులు బియ్యం అక్రమార్కుల మూలాలపై దృష్టిపెట్టకుండా కేవలం రోడ్డుపై అరుదుగా దొరికే బియ్యంపై మాత్రమే దృష్టిసారించారు. ఆంధ్రప్రదేశ్, తమళనాడు,మహారాష్ట్ర సరిహద్దులలో తెలంగాణ బియ్యం కోసం ప్రత్యేకంగా వ్యాపారులు దుకాణాలు తెరిచి బియ్యం దందాను ప్రోత్సహిస్తున్నా పోలీసులు, పౌరసరఫరాశాఖ, రెవెన్యూశాఖ అధికారులనలో సమన్వయం తో పనిచేయడంలేదు. ఎపిసిట్ తనిఖీచేసిన గోదాముల్లో 51,427 టన్నుల సాధారణ బియ్యం, ఫోర్టిఫైడ్ చేసిన రైసు 26,488టన్నుల బియ్యం తెలంగాణకు చెందినదని తేలిందని విశ్వసనీయవర్గాల భోగట్టా. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలో ఒక రైసుమిల్లు నుంచి బయటి దేశాలకు తరలుతున్న ఫోర్టిఫైడ్ రైసుకు బయటి దేశం దళారీ చేతిలోపడే వరకు కిలో 210రూపాయలు పలుకుతుందని చర్చించుకుంటున్నారు. బియ్యం లబ్దిదారులు నుంచి పదిరూపాయలకు కొనుగోలు చేసి రైసు మిల్లరుకు కిలోకు 22 రూపాయలను నుంచి 25రూపాయలవరకు విక్రయిస్తారు.రైసుమిల్లరు వాటిని రీసైకిలంగ్ చేసి 45రూపాలయు పోర్టులో విక్రయిస్తారు. వీటిని సేకరించే మాఫియా పోర్టులో కిలోకు 70నుంచి 80రూపాయలకు >>2

## అధికారం మాత్రమే పోయింది..
# ప్రజల్లో అభిమానం ఏమాత్రం తగ్గలేదు
### 'నమ్మి నానబోస్తే' షార్ట్‌ఫిల్మ్ ప్రివ్యూ సందర్భంగా కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 7:** ఈ ఏడాది పాలనలోనే తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై మనసు విరిగిందని, మళ్లీ అధికారం కేసీఆర్‌కే దక్కుతుందని ఓ సర్వే ప్రతినిధి చెప్పినట్లు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నమ్మి నానబోస్తే షార్ట్ ఫిల్మ్ ప్రివ్యూ సందర్భంగా శనివారం కేటీఆర్ మాట్లాడారు. ఇవాళ నా వద్దకు ఓ సర్వే ప్రతినిధి వచ్చి.. ఈ ఏడాది పాలన గురించి విశ్లేషణాత్మకంగా చెప్పారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు వస్తే ఎలా ఉంటుందో చెప్పారు. ఆయన చెప్పిన మాట ఏంటంటే.. సహజంగా ఏ ప్రభుత్వం మీద అయినా మూడు, నాలుగేండ్ల తర్వాత కోపం వస్తది.. తెలంగాణ ప్రజలకు ఓపిక పట్టే గుణం ఉంది. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఏడాదిలోనే మనసు విరిగింది. కేసీఆర్ నాయకత్వంలో పోరాటాలు చేస్తున్నారో దీన్ని తప్పకుండా కొనసాగించండి.. అధికారం కేసీఆర్‌కు దక్కుతుందని చెప్పారని కేటీఆర్ తెలిపారు. గాంధీ భవన్ బోసిపోతోంది.. తెలంగాణ భవన్ నిత్యం కళకళలాడుతోంది. లగచర్ల గిరిజన ఆడబిడ్డలు అందరూ వచ్చి తమ కుటుంబ సభ్యులను జైలు నుంచి విడిపించాలని కోరారు. వారి విడుదల కోసం లీగల్ సెల్ బృందం కష్టపడి న్యాయ పోరాటం చేస్తున్నారు. గిరిజన రైతులను బయటకు తీసుకొస్తామని ధైర్యం చెప్పాను. ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్, ఎస్సీ,ఎస్టీ కమిషన్లకు కూడా ఫిర్యాదులు చేశాం. ఇక మా బకాయిలు ఇప్పించాలని మాజీ సర్పంచ్‌లు అడిగారు. ఆశా వర్కర్లు మా గురించి అసెంబ్లీలో మాట్లాడాలని కోరుతున్నారు. ఈ ఒక్కరోజే అందరూ తెలంగాణ భవన్‌కు వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారని కేటీఆర్ తెలిపారు. సూటిగా, సుత్తి లేకుండా సామాన్యుడికి అర్థమయ్యే విధంగా నమ్మి నానబోస్తే షార్ట్ ఫిల్మ్‌లో స్పష్టంగా చెప్పారు. గుండెకు తట్టే విధంగా చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు రగిలిపోతున్నారన్నారు.

# క్షయ నిర్మూలనే లక్ష్యంగా కేంద్రం ముందడుగు
### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (పంజగుట్ట), డిసెంబరు 7, ప్రభాతవార్త:** ముక్తిభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎర్రగడ్డలోని టీబీ ఆసుపత్రిలో జాతీయ టీబీ నిర్మూలనే లక్ష్యంగా 100 రోజుల విస్తృత కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ దేశంలో సంపూర్ణ క్షయవ్యాధి నిర్మూలన కోసం నరేంద్రమోడీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 22 వేల కోట్ల ఖర్చుతో దేశమంతా క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమాలు చేపట్టామన్నారు. క్షయ వ్యాధిపట్ల ఉన్న అపోహలను తొలగించడంతోపాటు సమాజాన్ని జాగృతం చేయడం ద్వారా వ్యాధిని నిర్మూలించవచ్చన్నారు. ముందునుంచే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే సమూలంగా క్షయ వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చన్నారు.

దేశవ్యాప్తంగా 347 జిల్లాల్లో 100 రోజుల నిక్షయ్ శివిర్ ప్రచారం నిర్వ హించబడుతుందన్నారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజల దగ్గరకు వెళ్లి సహాయక కార్యక్రమాలు నిర్వ హించాలని సూచించారు. వ్యాధి నిర్మూలనకు దేశం ధృఢత్వ నిబద్ధతను నొక్కిచెబుతూ నిక్షయ్ పోషణ్ యోజన కింద నెలవారీ పోషకాహార మద్దతు చికిత్స సమయంలో రోగులందరికీ ప్రస్తుతం ఉన్న 500 రూపాయల నుండి 1000 రూపాయల వరకు రెట్టింపు చేయడం జరిగిం దన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నుంచి మొదలు ఎంపిటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్‌లు, మున్సిపల్ చైర్మన్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్వచ్ఛంధ సంస్థలు, కాలేజి విద్యా ర్థులు.. ఇలా ప్రతి ఒక్కరూ టీబీ ఫ్రీ ఇండియా దిశగా చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వం దేశమంతా మొబైల్ మెడికల్ యూనిట్‌లను ప్రవేశపెట్టిందన్నారు. వ్యాధిగ్రస్తులు నిరాశకు గురికాకుండా ధైర్యంగా పోషకాహారాన్ని తీసుకుంటూ ముందుకెళ్లాలని ఆయన సూచించారు.



జాతీయ టిబి నిర్మూలనపై 100 రోజుల విస్తృత కార్యక్రమంలో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

# జెఎన్ఎఫ్ఎయు ఇన్‌ఛార్జి విసిగా గంగాధర్ నియామకం
### ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జెఎన్ఎఫ్ఎయు) ఇన్‌ఛార్జ్ విసిగా ప్రొఫెసర్ తపరపు గంగాధర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ప్రొఫెసర్ గంగాధర్ జెఎన్ఎఫ్ఎయు ఇన్‌ఛార్జి విసిగా కొనసాగుతారని పేర్కొంటూ జిఓ ఆర్‌టి నంబర్ 230ని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఎన్ శ్రీధర్ శనివారం జారీ చేశారు. జెఎన్ఎఫ్ఎయు ఇన్‌ఛార్జ్ విసిగా నియమితులైన ప్రొఫెసర్ టి గంగాధర్ ప్రస్తుతం జెఎన్ఎఫ్ఎయులోని కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఇన్‌ఛార్జి విసిగా కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# ప్రైవేటు హైస్కూల్‌లో బాత్‌రూమ్ యాసిడ్ కిందపడి వ్యాపించిన పొగలు
### ఆహారం తింటున్న విద్యార్థులకు తీవ్రఅస్వస్థత

**హైదరాబాద్ (కుత్బుల్లాపూర్), డిసెంబరు 7, ప్రభాతవార్త:** బాత్‌రూమ్‌లను శుభ్రం చేసే యాసిడ్‌ను విద్యార్థులు అల్పాహారం తీసుకుంటున్న సమయంలో వినియోగిస్తుండగా కిందపడి పొగ వ్యాపించింది. దీనితో అక్కడే ఆహారం తింటున్న విద్యార్థులకు ఘాటైన వాసన కారణంగా తీవ్రఅస్వస్థతకు గురై వాంతులు, విరేచనాలతో పడిపోయారు. వెంటనే అక్కడేఉన్న ఉపాధ్యాయులు విద్యార్థులను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించగా కోలుకుంటున్నారు. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లోని ఈ హైస్కూల్ ఐడిపిఎల్ చౌరస్తాలో ఉంది. పాఠశాలలో శనివారం ఉదయం విద్యార్థులు తాము తెచ్చుకున్న ఆహారాన్ని మూడో అంతస్తులో తింటున్నారు. అదే సమయంలో బాత్ రూమ్‌లను శుభ్రంచేసే సిబ్బంది యాసిడ్‌పౌడర్‌ను పోస్తుండగా పౌడర్ బ్యాగు కిందపడి పగిలిపోయి నేలపై పడటంతో ఒక్కసారిగా పొగ వ్యాపించింది. విద్యార్థులు ఘాటైన పొగపీల్చడంతో కళ్లమంటలు, ఊపిరి పీల్చుకోవడంతో తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. అప్పుడే ఆహారం తీసుకున్న విద్యార్థులకు వాంతులతో బాధపడ్డారు. కొంతమంది విద్యార్థులకు రక్తపువాంతులు రావడంతో వెంటనే ఉపాధ్యాయులు వారిని సమీపంలోని ప్రాణధార ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. కాగా, ఆలస్యంగా విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని పాఠశాల యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆందోళనకు దిగారు. బాధ్యతారాహిత్యంతో వ్యవహరించిన హైస్కూల్ యాజమాన్యంపై వెంటనే కేసులు నమోదు చేయాలంటూ వారు డిమాండ్ చేశారు.

# మున్సిపాలిటీల్లో 51 గ్రామపంచాయతీలు విలీనం
### గెజిట్ జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఔటర్‌రింగ్ రోడ్డు పరిధిలోని 51 గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాల్టీల్లో విలీనం చేస్తు ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. గ్రామ పంచాయతీల విలీనాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను ఇప్పటికే హైకోర్టు కొట్టేవేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పుతో పంచాయతీల విలీనానికి మార్గం సుగమమైంది. దీంతో గవర్నర్ అమోదంతో గెజిట్ జారీ అయ్యింది. ఓఆర్ఆర్ లోపల ఉన్న, అలాగే బయటవైపు అనుకుని ఉన్న మొత్తం 51గ్రామ పంచాయతీలను విలీనానికి మంత్రివర్గం సబ్ కమిటీ సిఫారసు చేసింది. ఓఆర్ఆర్ పరిధి లోపల, ఓఆర్ఆర్‌ను అనుకొని ఉన్న 51 గ్రామపంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ సెప్టెంబరు 3న ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. గ్రామ పంచాయతీల విలీనంతో ఔటర్ రింగురోడ్డు పరిధి మొత్తం పూర్తి పట్టణ ప్రాంతంగా మారనుంది. రంగారెడ్డి జిల్లా పరిధిలో 12 గ్రామాలను 4 మున్సిపాలిటీల్లో కలపగా అత్యధికంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 28 గ్రామాలను 7 మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. సంగారెడ్డి జిల్లా పరిధిలో 11 గ్రామాలను అక్కడి రెండు మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# 5వ తరగతిలో ప్రవేశాలకు 18న నోటిఫికేషన్

**బయటి ఆహారంతోనే ఫుడ్ పాయిజినింగ్**

**ఇంటర్ ప్రవేశాలకు నో ఎగ్జామినేషన్**

**ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి వర్షిణి**

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త :** బయటి నుంచి వచ్చిన ఆహార పదార్థాల వల్లే తెలంగాణలోని సంక్షేమ గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మాసాబ్‌టాంక్ సంక్షేమ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఇంటి వద్ద నుండి తల్లిదండ్రులు గురుకులాల్లోని తమ పిల్లలకు పచ్చళ్లు పెట్టి పంపుతున్నారని, వాటివల్ల కూడా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. బయటి నుంచి, లేదంటే ఇండ్లకు వెళ్లి వచ్చిన అనంతరమే, సదరు విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురవుతున్నారని పేర్కొన్నారు. ఫుడ్ పాయిజన్‌ను అరికట్టేందుకు పలు చర్యలు చేపట్టామని వెల్లడించారు. ఎక్కడయినా గురుకులంలో భోజనం సరిగా లేకపోతే, తనకు నేరుగా ఫోన్ చేయాలని, మెసేజ్ పంపాలని, వీలైతే మెయిల్ చేయాలని సూచించారు. అంతేకాకుండా తాను వచ్చే వరకూ తినబోమని సొసైటీ సిబ్బందికి చెప్పాలని విద్యార్థులకు సైతం తెలియచేసినట్లు పేర్కొన్నారు. కూరగాయలు తరలించేందుకు కంటెయినర్లు కొనుగోలు చేయాలని, శుభ్రమైన ప్రదేశాల్లో వంటలు చేయాలని, కుకింగ్ సిబ్బంది యూనిఫామ్స్, గ్లౌజ్, క్యాప్ పెట్టుకోవడం తప్పనిసరి చేశామని, అటువంటి జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. కాగా గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నదన్నారు. ఫిబ్రవరి 23న రాతపరీక్ష నిర్వహించి, జూన్ 12లోగా అడ్మిషన్ ప్రక్రియను పూర్తిచేయాలనే లక్ష్యంతో ఉన్నామని పేర్కొన్నారు. 45 రోజులపాటు అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతుందని, ఆన్‌లైన్ లేదా జోనల్ ఆఫీస్‌లకు వెళ్లి అడ్మిషన్ పొందవచ్చని చెప్పారు. ఇందుకోసం వెబ్‌పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియను మరింత సరళతరం చేశామన్నారు. ఇంటర్ ప్రవేశాలకు సంబంధించిన పరీక్షను ఈ ఏడాది నుంచి రద్దు చేస్తున్నామని, పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే నేరుగా సొసైటీ జూనియర్ కాలేజీల్లో ప్రవేశం పొందవచ్చని వెల్లడించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కి సంబంధించి కూడా అదే విధానాన్ని ప్రవేశపెడతామని, పదో తరగతిలో అత్యధిక ఉత్తీర్ణత సాధించిన సొసైటీ విద్యార్థులకే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు.

## సభలో తొలిరోజే తెలంగాణ తల్లి విగ్రహంపై సిఎం ప్రకటన
### విగ్రహావిష్కరణ తేదీ, సమయం ఖరారు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 7:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈనెల 9న ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్నాయి. సభ తొలిరోజు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన చేస్తారు. తెలంగాణ తల్లి విగ్రహం నమూనాను వివరిస్తారు. తెలంగాణ తల్లి విగ్రహ నమూనాను సభ్యులరందరి సమక్షంలో సభలోనే విడుదల చేస్తారు. అంతకు ముందు ఇటీవల మరణించిన మాజీ ఎమ్మెల్యేల మరణం పట్ల సభలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సంతాపాలు ప్రకటిస్తారు. ఆ తర్వాత సభ ఎన్ని రోజులు నిర్వహించుకోవాలనే విషయంలో, సభలో చర్చించాల్సిన అజెండాపై స్పీకర్ అధ్యక్షతన బిఎసి(సభా వ్యవహారాల సలహా కమిటీ) సమావేశం కానుంది. కాగా, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ తేదీ, సమయం ఖరారు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డిసెంబర్ 9, సాయంత్రం 6.05 నిమిషాలకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేయనున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. అన్ని విభాగాలకు సంబంధించిన చీఫ్ సెక్రటరీలు,ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఉన్నతాధికారులు, అధికారులు, వర్కింగ్ స్టాఫ్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆవిష్కరణ వేడుకలకు హాజరు కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## దేశంలో ఫాసిస్టు వ్యతిరేక పోరాటాలను
# తీవ్రతరం చేయాలి
### సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగాన్నిరిపబ్లిక్‌ను ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, నవంబరు 26 నుండి జనవరి 26 వరకు 'రాజ్యాంగాన్ని రక్షించండి, రిపబ్లిక్‌ను బలోపేతం చేయండి' ప్రచారంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ వివిధ రూపాలలో కార్యక్రమాలు చేబట్టాలని సిపిఐ(ఎంఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య పిలుపునిచ్చారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్య దర్శి దీపాంకర్ భట్టాచార్య పాల్గొని మాట్లాడుతూ శత వార్షికోత్సవ సంవత్సరంగా పాటిస్తూ దేశ వ్యాప్తంగా కమ్యూనిస్ట్ ఉద్యమ వారసత్వాన్ని స్ఫూర్తిని ప్రజలకు చాటి చెప్పాలన్నారు. ఆర్.ఎస్.ఎస్, బిజెపి నేడు అధికారాన్ని చేజిక్కించుకొని దేశంలో ఫాసిస్ట్ పాలనను కొనసాగిస్తూ రాజ్యాంగాన్ని మనువాద రాజ్యాంగంగా మార్చాలనే కుట్రను కొనసాగిస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు.



ప్రెస్‌మీట్‌లో మార్ఫింగ్ పోస్టులు చూపుతున్న భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

# రాహుల్‌గాంధీ వ్యక్తిత్వాన్ని కించపరిచేలా విషప్రచారం
### హాయత్‌నగర్ పిఎస్‌లో ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు

**హైదరాబాద్ (హాయత్‌నగర్), డిసెంబరు 7, ప్రభాతవార్త:** కాలేదన్ కా కిస్సా హై... రాహు కా ఇస్సా హై పేరుతో బీజేపీ అధికారిక ఎక్స్ ప్లాట్ ఫామ్‌లో రాహుల్‌గాంధీని కించపరచడంపై భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ వ్యక్తిత్వాన్ని కించ పరిచేలా బీజేపీ గుజరాత్ ఎక్స్ ప్లాట్‌ఫామ్‌లో పోస్టర్లు, సోషల్‌మీడియా ద్వారా విస్తృతంగా విషప్రచారం చేయడాన్ని వారు తప్పుపట్టారు. నల్లధనం నుంచి తన వాటాను సేకరిస్తున్నారనే ఆరోపణతో కరెన్సీ నోట్లను కలిగి ఉన్న మార్ఫింగ్ చిత్రాన్ని పోస్ట్ చేయడాన్ని వారు తప్పుపట్టారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, ఐదుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా వేరు వేరు హోదాల్లో పనిచేసిన రాహుల్‌గాంధీపై అసత్య ప్రచారం చేయడాన్ని వారు ఖండించారు. కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక బీజేపీ దిగజారుడు ప్రచారాలకు దిగుతోందన్నారు. మార్ఫింగ్ చేసిన ఫొటోలలో నల్లధనం సేకరిస్తున్నట్లు చూపడం వల్ల కాంగ్రెస్ పార్టీకి, భువనగిరి ఎంపిగా తన వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగిందని ఆరోపించారు.

# పెరిగిన కోడిగుడ్డు ధరలు.. తెలుగు రాష్ట్రాల్లోనే టాప్!

**విజయవాడ, డిసెంబరు 7, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో కోడి గుడ్ల ధరలు భారీగా పెరిగాయి. కోడి మాంసం ధరలు స్థిరంగా ఉంటే గుడ్ల ధరలు అధికంగా ఉన్నాయి. ఒక్క గుడ్డు చిల్లర ధర ఏకంగా రూ.7.20 నుంచి రూ.8 వరకు పలుకుతుంది.. సాధారణంగా కార్తీకమాసంలో కోడి గుడ్ల ధరలు తక్కువగా ఉంటాయి.అయితే ఈ పర్యాయం అందుకు భిన్నంగా గుడ్ల ధరలు అధికంగానే పలికాయి.కార్తీక మాసం దాటిన తరువాత తగ్గుతాయనుకున్న కోడి గుడ్డు ధరలు భారీగా పెంచేసారు, నేషనల్ ఎగ్ కో - ఆర్డినేషన్ కమిటీ ఒక గుడ్డు ధరను రూ.6.20 గా నిర్ణయించగా 30 గుడ్ల ట్రే ధర 186 రూపాయలుగా ఉంది.

ఇక, వెన్‌కాబ్ లాంటి కొన్ని చికెన్ విక్రయ సంస్థలు 12 గుడ్లను 38 రూపాయలకు అమ్ముతున్నాయి. అంటే ఒక్కో గుడ్డు ధర 7.08 రూపాయలుగా ఉంది. ఇక, హైపర్ మార్కెట్లు ఆన్‌లైన్‌లో ప్రొటీన్ గుడ్లు నౌరిష్ గుడ్లు, విటమిన్-డి, విట్రిచ్, హై ప్రొటీన్, బ్రౌన్ ఎగ్స్‌గా ప్యాక్ చేసి అమ్మకాలు చేసి ఒక్కో గుడ్డు ధర 10 నుంచి 20 రూపాయల వరకు సేల్ చేస్తున్నారు. హెర్బల్ గుడ్ల పేరిట ఓ కంపెనీ ఆన్‌లైన్ మార్కెట్లో కేవలం 6 గుడ్లను ఏకంగా 112 రూపాయలకు విక్రయిస్తోంది. ఇవి ఎమ్మార్పీలుగా ప్రకటించినా గుడ్ల ధరలు అధికంగానే ఉంటున్నాయి.

స్పాట్ మార్కెట్ రేటు అంటూ వ్యాపారులు వీటిని అమ్ముతున్నారు.సాధారణ పచారీ దుకాణాలో రిటైల్‌గా కొనుగోలు చేసే గుడ్లను ఏడు రూపాయలకే అమ్ముతున్నారు. దేశవ్యాప్తంగా ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. దీంతో గుడ్డు ధరలు భారీగా పెరిగాయని తెలంగాణ పౌల్ట్రీ పరిశ్రమ పేర్కొంది.

కోళ్లకు ప్రధాన దానా అయిన మొక్కజొన్న ధర పెరగటంతోనే గుడ్డు ధర పెంచాల్సి వచ్చిందని చెప్పుకొచ్చారు. ఇక, దేశంలో సౌత్ ఇండియా రాష్ట్రాలైన ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, తమిళనాడులోనే పౌల్ట్రీ పరిశ్రమ ప్రధానంగా కేంద్రీకృతమై ఉంది.

నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ప్రతి రోజు 32 కోట్ల వరకు గుడ్లు ఉత్పత్తి జరుగుతుంది. అయితే, ఈ మూడు రాష్ట్రాల్లోనే 15 కోట్ల వరకు గుడ్ల ఉత్పత్తి అవుతుందన్నారు. రోజూ 5 కోట్లకు పైగా గుడ్ల ఉత్పత్తితో ఏపీ, తెలంగాణ తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి.

# కస్టడీ కోసం మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి వికారాబాద్‌కు తరలింపు

### తెలంగాణభవన్‌కు లగచర్ల బాధితుల కుటుంబసభ్యులు
### అసెంబ్లీలో ప్రస్తావిస్తా: మాజీమంత్రి కెటిఆర్



తెలంగాణ భవన్‌లో కెటిఆర్‌తో మాట్లాడుతున్న లగచర్ల బాధితులు

**వికారాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** లగచర్ల ఘటనలో ప్రధాన నిందితుడైన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని శనివారం చర్లపల్లి జైలు నుంచి వికారాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీసు శిక్షణ కేంద్రానికి తీసుకువచ్చారు. నరేందర్‌రెడ్డి తరపు న్యాయ వాది వికారాబాద్ జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. లగచర్ల ప్రధాన నిందితుడుగా భావిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ జిల్లా పోలీసు శాఖ కొడంగల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. ఇందు లో భాగంగా శుక్రవారం కొడంగల్ కోర్టు కొన్ని ఆంక్షలతో కూడిన పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. నరేందర్‌రెడ్డిపై థర్డ్ డిగ్రీ వంటివి చేయ రాదని, మానవ హక్కు లకు భంగం కలుగకుండా న్యాయవాది సమక్షం లోనే విచారణ చేపట్టాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే తాను నరేందర్‌రెడ్డిని హైదరాబాద్ నుంచి ఫాలో అవుతూ వికారాబాద్‌కు వచ్చానని వివరించారు.

అనంతరం న్యాయవాది నరేందర్‌రెడ్డిని ఉంచిన జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలోకి పోయారు. ఇదిలా ఉండగా, లగచర్ల భూబాధితులు, లగచర్ల ఘటన నిందితులకు సంబంధించిన కుటుంబసభ్యులు శనివారం తెలం గాణ భవన్‌కు చేరుకుని మాజీమంత్రి కెటిఆర్‌ను కలిశారు. జైళ్లల్లో మగ్గుతున్న వారిని విడిపించాలని కెటిఆర్‌ను వేడుకున్నారు. దీనికి కెటిఆర్ స్పందిస్తూ.. లగచర్ల బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని, త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో లగచర్ల ఘటన విషయాన్ని చర్చించి ప్రభుత్వాన్ని నిలదీస్తానని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చినట్లు తెలిసింది.

## వెంకన్న ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి : కన్నడ సినీనటులు

**తిరుమల,డిసెంబర్ 7ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్ష దైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని కన్నడ సినీనటులు వేడుకున్నారు. శనివారం వేకువజామున సుప్ర భాతసేవలో కన్నడ సినీ నటుడు, నిర్మాత శివరాజ్ కుమార్ కుటుంబంతో కలిసి ఆలయంలోనికి చేరుకున్నారు. స్వామివారిని సుప్రభాతసేవలో దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# సిఎంఆర్ ధాన్యం మార్కెట్ గోదాముల్లో నిల్వ

**37లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణ**

**రూ.395 కోట్ల బోనస్ కింద సన్నాలకు చెల్లింపు**

**సేకరించిన ధాన్యానికి ఎంఎస్‌పి కింద రూ.7,300 కోట్లు చెల్లింపు**

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** సిఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టకుండా వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాముల్లో నిల్వచేయడానికి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది.వానాకాలం 150లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేస్తామనే లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 7572 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో 30లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గిడ్డంగులను సిద్ధం చేశారు. శనివారం నాటికి 37లక్షలమెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించారు. అందులో 12లక్షల మె.ట సన్నాలు, 25లక్షల దొడ్డురకం ధాన్యం సేకరించారు. 37లక్షల ధాన్యంకు కనీస మద్దతు ధర కింద రైతులకు ఇప్పటికి రూ.7300కోట్లు,సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 చొప్పన బోనస్ కింద రూ.395కోట్లు చెల్లించారు. మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వడం ప్రాసెస్ దశ దాటి ముందుకు రాకపోవడంతో పాటు, గత రెండు సీజన్లలో ధాన్యం నిల్వల రాశులు మిల్లుల వద్ద పేరుకొని పోవడంతో ఇప్పుడు ప్రభుత్వం సేకరిస్తున్న ధాన్యం దింపుకొనేందుకు మిల్లు వద్ద స్థలం లేదు. దీనితో రాష్ట్రంలో 197 వ్యవసాయమార్కెట్ యార్డులో అనుకూలంగా ఉన్న గిడ్డంగులలో నిల్వచేయడానికి సన్నాహాలు చేపట్టారు. తెలంగాణ వ్యాప్తంగా మార్కెట్ యార్డులలో రైతులు ధాన్యం నిల్వచేసుకొనేందుకు ఈ గిడ్డంగులు నిర్మించారు. తమకు మద్దతు ధర రాలేదని రైతులు అనుకున్నప్పుడు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డు గోదాముల్లో నిల్వచేసుకొనేవారు. మార్కెట్‌యార్డుల్లో నిల్వచేసిన ధాన్యంకు రుణం కూడా ఇచ్చేవారు. మొదటి 90రోజులు ఉచితంగా రైతులు మార్కెట్ యార్డుల్లో నిల్వచేసుకొనే అవకాశం ఉంది.పసుపు,మిర్చిపంటలు నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయమార్కెట్ కమిటీల్లో నిల్వచేసుకుంటారు. అంతేకాదు అక్కడ కోల్డ్‌స్టోరేజిలకు కూడా గిరాకి అత్యధికంగా ఉంటుంది. మిగితా జిల్లాలో రైతులకు అవగాహన లేకపోవడంతో గోదాముల్లో వారి వ్యవసాయ ఉత్పత్తులను నిల్వచేసుకోవడంలేదు.ఇప్పుడు ప్రభుత్వంకు ఈ గోదాములు ఉపయోగపడుతున్నాయి. మిల్లులకు కేటాయించిన ధాన్యంను మార్కెట్ యార్డులో నిల్వచేస్తారు. నల్లగొండ,సూర్యపేట,యాదాద్రి భువనగిరి,కరీంనగర్, పెద్దపల్లి, జిల్లాలలో మార్కెట్ యార్డు గోదాముల్లో ధాన్యం దిగుమతి జరుగుతోన్నది. రైతుభద్రపరుచుకొనే గోదాములు మిల్లర్లకు ఇవ్వడానికి ఇంకా అధికారికంగా ఉత్తర్వులు రాలేదని ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలమేరకు దిగుమతి చేసుకుంటున్నామని మార్కెట్ అధికార వర్గాలు తెలిపాయి. మిల్లర్ల బ్యాంకు గ్యారెంటీ ఇంకా ప్రాసెస్ ప్రక్రియను దాటి అడుగు ముందుకు పడకపోవడంతో సిఎంఆర్ ధాన్యం భద్రతకు ఈ విధానం ఉపయోగపడుతుందని సివిల్ సప్లయ్ అధికారులు భావిస్తున్నారు. వ్యాపారులు ఇప్పటికే సిఎంఆర్ ధాన్యం సొంత వ్యాపారాలకు అమ్ముకొని ప్రభుత్వ ఖజానాకు కన్నం కొట్టారు. మార్కెట్ గోదాముల్లో ధాన్యం నిల్వ ఉంచితే మిల్లర్లు మిల్లింగ్ చేసిన ధాన్యం ఇస్తేనే ఇక్కడి ధాన్యం పౌరసరఫరాశాఖ అధికారులు వారి మిల్లుపాయింట్‌కు ఈ ధాన్యం తరలించడానికి అనుమతి ఇచ్చే అవకాశం కూడా ఏర్పడుతుంది. ధాన్యం తీసుకొనేందుకు సిఎంఆర్ బియ్యం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

## తెలంగాణతల్లి విగ్రహా ఆవిష్కరణకు ఏర్పాట్లు
### పర్యవేక్షించిన సిఎస్ శాంతికుమారి

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** డా.బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం సాయంత్రం పర్యవేక్షించారు. సోమవారం 9వ తేదీ సాయంత్రం తెలంగాణతల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత రెడ్డి ఆవిష్కరణ చేయనున్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి దాదాపు లక్ష మంది పాల్గొంటారని, ఇందుకు తగు ఏర్పాట్లు చేయాలని సి.ఎస్ సూచించారు. ఆవిష్కరణ సందర్భంగా పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటున్నందున తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మీడియా గ్యాలరీ, సాంస్కృతిక కార్యక్రమాల వేదికకు సంబంధించిన ఏర్పాట్లను కూడా పర్యవేక్షించారు. కార్యక్రమానికి హాజరయ్యే అతిథులకు, ప్రజాప్రతినిధులకు, విఐపిలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు.

## శ్రావ్యమైన సంగీతంతో వేంకటేశ్వరస్తోత్రం ఆడియో అద్భుతం
### ఆవిష్కరించిన టిటిడి చైర్మన్ నాయుడు




**తిరుమల,డిసెంబర్ 7ప్రభా తవార్తప్రతినిధి:** చిన్న వయసు లోనే భక్తిభావం, ఆధ్యాత్మికత అందిపుచ్చుకుని శ్రీవేంకటేశ్వర స్వామి స్తోత్రం అద్భుతంగా ఆలపించిన బాల గాయని నియాగ నాగసుంకరనేని భవిష్యత్తులో మంచి గాయని కావాలని టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు ఆశీర్వ దించారు. చిన్నారి ఆలపించిన వేంకటేశ్వరస్తోత్రం ఆడియోను శనివారం సాయంత్రం తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. నియార నాగసుంకరనేని ఆలపించిన శ్రీవేంకటేశ్వరస్వామి స్తోత్రానికి నిటార నాగ సుంకరనేని వాద్య సహకారం అందించింది. ఈ ఆల్బమ్‌కు డాక్టర్ కె.స్వరూప సంగీత సమర్పకులుగా వ్యవహరించారు. శ్రావ్యమైన సంగీతంతో పాటను మధురంగా గానంచేశారని చిన్నారులను బిఆర్ నాయుడు అభినందించారు. మరిన్ని పాటలతో గానామృతాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బొల్లినేని రవీంద్రనాథ్, గాయని తల్లిదండ్రులు డాక్టర్ నిష్మాసుంకరనేని, డాక్టర్ నిఖిల్ సుంకరనేని పాల్గొన్నారు.

ప్రధానంగా కార్పొరేట్ కాలేజీలు నీట్, జేఈఈలో ర్యాంకులే ప్రధానంగా విద్యను కొనసాగిస్తున్నాయి. అందులో భాగంగా విద్యార్థులను వారు చదివే సామర్థ్యాలనుబట్టి వారిని గ్రూపులుగా విభజించి పాఠాలు బోధిస్తున్నారు. ఇలాంటి బోధనల మూలంగావిద్యార్థులు ఒత్తిడికిగురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దాంతోపాటు కార్పొరేట్ కాలేజీల్లో చదివే విద్యార్థులకి ఆయాకాలేజీల యాజమాన్యాలు సరిగా సౌకర్యాలను కల్పించకపోవడంతో వాటిని ప్రశ్నించే విద్యార్థులను టార్గెట్ చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో వేధింపులను తట్టుకోలేక చివరికి విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇటువంటి ఘటనలు కూడా ఇటు తెలంగాణతోపాటు అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ జరుగుతున్నాయి. ప్రధానంగా విద్యార్థుల ఆత్మహత్యలు ఇంటర్మీడియట్ స్థాయిలోనే జరుగుతున్నాయి. ఇంటర్ వార్షిక పరీక్షలు రాసేవారు, రాసినవారు, ఆ తరువాత తాముచేరబోయే కోర్సుల మూలంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలను నివారించడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ప్రధానంగా ఇంటర్మీడియట్ స్థాయిలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడకుండా ఉండేందుకు విద్యార్థులకి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు కౌన్సిలర్లను ఏర్పాటుచేస్తోంది. ఎవరైనా విద్యార్థులు పరీక్షలపై ఒత్తిడికి గురైతే వారు కౌన్సిలింగ్ కోసం ఫోన్ చేస్తే వారికి తగిన సూచనలు, సలహాలను కౌన్సిలర్లు ఇస్తున్నారు. ఇదే విధానం ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలుకూడా అమలు చేయాల్సి ఉండగా రాష్ట్రంలోని ఏ ఒక్కకాలేజీలో కూడా ఇటువంటి కౌన్సిలర్లు కార్పొరేట్ కాలేజీల్లో కనిపించరు. పోటీపరీక్షల్లో విజయం సాధించలేక కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే మరికొందరు విద్యార్థులు పోటీపరీక్షలురాయక ముందే భయపడి, పరీక్షల్లో ఫెయిలవుతామనే భయంతో కూడావిద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

# విద్యార్థుల ఆత్మహత్యల రేటు రెండింతలు

**నాగమణీంద్ర పల్లాపు**

దేశంలో ఈ మధ్య కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో చదువుపై పెట్టే ఒత్తిడితోపాటు.. పోటీ పరీక్షల్లో విజయం సాధించలేమని భయంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా గత కొద్ది సంవత్సరాలుగా నీట్, జేఈఈ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షల మూలంగా విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నట్టు జాతీయస్థాయి అధికారిక గణాంకాలు చూస్తే అర్థం అవుతోంది. అయితే జాతీయస్థాయి పోటీ పరీక్షలే కాకుండా రెగ్యులర్ వార్షిక పరీక్షలను తట్టుకోలేక కూడా కొందరు విద్యార్థులు ఆత్యహత్యలకు పాల్పడుతున్నారు. వాటితోపాటు తమకు ఇష్టంలేని కోర్సుల్లో చేర్పించడంతో వాటిని అధిగమించలేక కూడా విద్యార్థులు సూసైడ్ చేసుకుంటున్నారు. గత 20ఏళ్లలో మొత్తం ఆత్మహత్యల కంటే విద్యార్థుల ఆత్మహత్యల రేటు రెండింతలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థుల ఆత్మహత్యల్లో మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్ అగ్రస్థానంలో ఉన్నాయి. విద్యార్థుల ఆత్మహత్యల్లో బాలుర కంటే బాలికలే ఎక్కువగా ఉంటున్నట్టు లెక్కలను బట్టి తెలుస్తోంది. రాజస్థాన్‌లోని కోటాలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా 2020లో ఆత్మహత్యలు జరగలేదు. అందుకు కారణం కోవిడ్ మహమ్మారి కారణంగా ఇన్‌స్టిట్యూట్‌లు మూసివేయబడి ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించబడిన నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడికి గురికావడం గానీ, నేరుగా చదువుకోవడానికి రాకపోవడంతో ఆత్మహత్యలు జరగలేదు. విద్యార్థుల ఆత్మహత్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ జరుగుతూనే ఉన్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచే ఆత్మహత్యలు కూడా మొదలవుతున్నాయి. ప్రధానంగా విద్యార్థులు 10వ తరగతి వరకు ఇంటి నుంచి స్కూల్ వెళ్లి వస్తుండటం, ఆ తరువాత ఇంటర్మీడియట్‌లో రెసిడెన్షియల్ పద్ధతిలో ఉన్న కాలేజీల్లో చేరడంతో, దానిని తట్టుకోలేక విద్యార్థులు చనిపోవడానికి ప్రయత్నిస్తున్నారు. వీటికి తోడు కార్పొరేట్ కాలేజీల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు చదువుతప్ప మరోధ్యాస లేకుండా చేస్తున్నారు. దీంతో కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇవే కాకుండా వృత్తి విద్యా కోర్సులైన మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులు కోర్సు మధ్యలో ఫెయిలైన కారణంగా సీనియర్లు, ఇతరుల ర్యాగింగ్, వేధింపుల మూలంగా కూడా కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఐఐటీ వంటి ఉన్నతస్థాయి సంస్థల్లో చేరిన విద్యార్థులు కూడా ఒత్తిడి



ని, ర్యాగింగ్‌ను తట్టుకోలేక సూసైడ్‌చేసుకుంటున్న సందర్భాలు అక్కడక్కడ జరుగుతున్నాయి. ఇక మెడిసిన్‌లో అయితే ఉత్తీర్ణత సాధించకపోతే ఆ ఒత్తిడితో విద్యార్థులు సూసైడ్ బాట పడుతున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ జరుగుతున్నాయి. పోటీ పరీక్షలైన నీట్, జేఈఈలో రెండు రాష్ట్రాల నుంచి గణనీయ సంఖ్యలోనే పోటీ పడుతున్నారు. ఈ క్రమంలోనే ఆత్మహ్యత్యలోనూ అదేస్థాయిలో జరుగుతున్న ఘటనలు ఇటు తెలంగాణతోపాటు, అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ జరుగుతున్నాయి. పోటీ పరీక్షలతోపాటు సాధారణంగా జరిగే వార్షిక పరీక్షల్లోనూ విజయం సాధించలేమని పరీక్షలకి ముందుగానే ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారు కొందరైతే పరీక్షలు ముగిసిన తరువాత తాము పరీక్షల్లో ఫెయిలవుతామని ఫెయిలైతే ఇంట్లో తల్లిదండ్రులు తిడతారని భయంతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత ఏడాది ఇటువంటివే రెండు ఘటనలు జరిగాయి. తీరా పరీక్షల ఫలితాలువెలువడిన తరువాత చూస్తే ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులు పాసయ్యారు. రెండు రాష్ట్రాల్లో కూడా ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు భారీగానే ఉన్నాయి. వాటిలో చదివే విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివేకంటే 4రెట్లు అధికంగా ఉంటున్నారు. ప్రధానంగా కార్పొరేట్ కాలేజీలు నీట్, జేఈఈలో ర్యాంకులే ప్రధానంగా విద్యను కొనసాగిస్తున్నాయి. అందులో భాగంగా విద్యార్థులను వారు చదివే సామర్థ్యాలను బట్టి వారిని గ్రూపులుగా విభజించి పాఠాలు బోధిస్తున్నారు. ఇలాంటి బోధనల మూలంగా విద్యార్థులు ఒత్తిడికిగురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దాంతోపాటు కార్పొరేట్ కాలేజీల్లో చదివే విద్యార్థులకి ఆయా కాలేజీల యాజమాన్యాలు సరిగా సౌకర్యాలను కల్పించకపోవడంతో వాటిని ప్రశ్నించే విద్యార్థులను టార్గెట్ చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో వేధింపులను తట్టుకోలేక చివరికి విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇటువంటి ఘటనలు కూడా ఇటు తెలంగాణతోపాటు అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ జరుగుతున్నాయి. ప్రధానంగావిద్యార్థుల ఆత్మహత్యలు ఇంటర్మీడియట్ స్థాయిలోనే జరుగుతున్నాయి. ఇంటర్ వార్షిక పరీక్షలు రాసేవారు, రాసినవారు, ఆ తరువాత తాము చేరబోయే కోర్సుల మూలంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలను నివారించడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ప్రధానంగా ఇంటర్మీడియట్ స్థాయిలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడకుండా ఉండేందుకు విద్యార్థులకి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు కౌన్సిలర్లను ఏర్పాటు చేస్తోంది. ఎవరైనా విద్యార్థులు పరీక్షలపై ఒత్తిడికి గురైతే వారు కౌన్సిలింగ్ కోసం ఫోన్ చేస్తే వారికి తగిన సూచనలు, సలహాలను కౌన్సిలర్లు ఇస్తున్నారు. ఇదే విధానం ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు కూడా అమలు చేయాల్సి ఉండగా రాష్ట్రంలోని ఏ ఒక్కకాలేజీలో కూడా ఇటువంటి కౌన్సిలర్లు కార్పొరేట్ కాలేజీల్లో కనిపించరు. పోటీపరీక్షల్లో విజయం సాధించలేక కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే మరికొందరు విద్యార్థులు పోటీ పరీక్షలు రాయక ముందే భయపడి సూసైడ్ చేసుకుంటున్నారు. సాధారణ పరీక్షల్లో ఫెయిలైన వారు, పరీక్షల్లో ఫెయిలవుతామనే భయంతో కూడావిద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమపిల్లలు తమలాగా కాకుండాఉండాలనే ఉద్దేశంతో వారిని ఉన్నతంగా చూడాలని ఆశ, ఆతృతతో వారిని నీట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌కి సిద్ధం కావాలని ప్రత్యేకంగా కోచింగ్‌లు ఇప్పిస్తున్నారు. అయితే పిల్లలు వారి తల్లిదండ్రుల మాటను కాదనలేక కొందరు, కాదన్నప్పటికీ తల్లిదండ్రులు తప్పకుండా చదవాలని పంపించడంతో కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు తెలంగాణలో ఆర్‌జీయూకేటీలో ముగ్గురు విద్యార్థులతో పాటు మరోముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యలకి పాల్పడ్డారు. వైద్యవిద్యలో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ఎంట్రన్స్ టెస్ట్(నీట్)ను నిర్వహిస్తోంది. నీట్ కోచింగ్‌కి దేశంలోనే రాజస్థాన్‌లోని కోటా పేరుగాంచింది. ప్రతి ఏడాది నీట్‌లో ర్యాంకులు సాధించే వారిలో కోటాలో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు తప్పకుండా ఉంటారు. దీంతో రాజస్థాన్ చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి విద్యార్థులను ఎక్కువ మందిని కోచింగ్ కోసం అక్కడికి పంపిస్తుంటారు. ఇలా కోచింగ్ కోసం వచ్చిన వారిలో ఒత్తిడికి గురవ్వడమే కాకుండా భయపడి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు కేంద్ర ప్రభుత్వంతోపాటు.. రాష్ట్ర ప్రభుత్వాన్ని కలవరపెడుతున్నాయి. 2024 సంవత్సరంలో ఇప్పటివరకు 19 మంది బలవన్మరణాలకు పాల్పడినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వివిధ పోటీపరీక్షల కోచింగ్ సెంటర్లకు ప్రసిద్ధిచెందిన కోటాలో విద్యార్థులు ఒత్తిడి కారణంగానే బలవన్మరణాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆత్మహత్యలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాజస్థాన్ ప్రభుత్వం పలుమార్లు పేర్కొంది. విద్యార్థుల కోసం హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులో ఉంచినప్పటికీ ఆత్మహత్యలు తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది. దేశంలో అత్యధికంగా విద్యార్థుల ఆత్మహత్యలు మహారాష్ట్రలో జరుగుతున్నట్టు ఒక నివేదిక ప్రకటించింది. 2022లో దేశంలో 13,044 మంది విద్యార్థుల ఆత్మహత్యలు నమోదు కాగా 2021లో 13,089 మంది బలవన్మరణాలు జరిగాయి. ●

---

మహారాష్ట్ర

# 'ఆట' మారింది..

**ఎ.వి.వి ప్రసాద్**

ఎన్నో అసంతృప్తులు, మరెన్నో అభిప్రాయభేదాల మధ్యఎట్టకేలకు కొత్త 'మహాయుతి' ప్రభుత్వం కొలువుదీరింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ప్రభుత్వం ఏర్పడడానికి 11 రోజులు పట్టిందంటే అది సాధారణమైన 'పరిణామం' కాదనే చెప్పాలి. గత గురువారం (5, డిసెంబరు) మళ్లీ ప్రమాణం చేసింది ఆ 'ముగ్గురే' కానీ వారి సీట్లు మారాయి. ఆ సీట్ల మార్పుకే ఇన్ని రోజుల వ్యవధి అవసరమైంది. నిజానికి మహాయుతికూటమికి పూర్తి మెజారిటీ వచ్చింది. అసెంబ్లీలో 288 సీట్లు ఉండగా, బిజెపి నాయకత్వంలోని ఫ్రంట్‌కు అనూహ్యంగా 234సీట్లు లభించాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తారుమారు చేస్తూ మహాయుతి పార్టీలు సీట్లు సాధించాయి. 149 సీట్లకు పోటీ చేసిన బిజెపికి అత్యధికంగా 132 సీట్లు లభించగా మిత్రపక్షాలైన షిండే శివసేనకు 57 సీట్లు, అజిత్ ఎన్‌సిపికి 41 సీట్లు లభించాయి. అదేసమయంలో 100సీట్లకు పోటీచేసినకాంగ్రెస్‌కు 16సీట్లు మాత్రమే లభిస్తే, ఉద్ధవ్ శివసేనకు 20, శరద్‌పవార్ ఎన్‌సిపికి 10 మాత్రమే సీట్లు లభించాయి. ఆరునెలల క్రితం లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలకు చాలా భిన్నంగా అసెంబ్లీ ఫలితాలు రావడంతో అంతా సాగిపోయి సునాయాసంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందనే అనుకొన్నారు. కానీ ఒక వంక ఫలితాలు వెలువడుతుండగానే అపస్వరాలు వినిపించడం కూడా మొదలయ్యాయి. నవంబరు 23న ఫలితాలు బిజెపికి అనుకూలంగా రావడం చూసి అప్పుడే చాలా మంది ఫడ్నవిస్ ముఖ్యమంత్రి అవుతారని ఊహించారు. అదే సమయంలో ఏక్‌నాథ్‌షిండే ఒక వ్యాఖ చేస్తూ 'ముఖ్యమంత్రి ఎక్కువ సీట్లు వచ్చిన పార్టీ నుండే ఉండాలనే నిబంధన ఏదీ లేదు' అనడం చాలా మందిని విస్మయపరిచింది. షిండే వ్యాఖ్యలో ఏదో అపస్వరం వినిపించింది. ఫలితాలు పూర్తిగా వెల్లడైన తరువాత కూడా భిన్నమైన ప్రకటనలే వినిపించడం ఆరంభించాయి. రెండున్నర సంవత్సరాలు అప్పటికే ముఖ్యమంత్రిగా ఉన్న షిండే తన సీటు కాపాడుకోవాలనుకోవడంలో తప్పులేకపోయినా, 'మిత్ర ధర్మం' పాటించాల్సిన సమయం వచ్చేసరికి ఏదో 'అసంతృప్తి' ఆయనలో మొదలైంది. తనవల్లే 'మహాయుతి' ఎన్నికల్లో ఘన విజయం సాధించిందనే అభిప్రాయం కూడా పరోక్షంగా ఆయన అన్నట్లు పదేపదే వినిపించింది. అటు అజిత్‌పవార్ కూడా అదే ధోరణితో కనిపించారు. పైకి అందరూ ప్రధాని మోడీ అమిత్ షాలు ఏంచెప్తే అదే చేస్తామని ప్రకటించినా ఎవరి 'శిబిరాల'లోకి వారు వెళ్లిపోయి 'మంత్రాంగం' ప్రారంభించారు. లెక్కప్రకారం ఫడ్నవిస్ ముఖ్యమంత్రి కావలసి ఉన్నా, షిండే 'అసంతృప్తి' వల్ల తర్వాత వారం రోజులు వృధా గా గడిచిపోయాయి. ఎవరి దారిన వారుచర్చలు జరుపుతూనే ఉన్నారు. ఎవరి గొంతెమ్మకోర్కెలు వారు వెలిబుచ్చుతూనే ఉన్నారు. అసలు 'మహాయుతి' ప్రభుత్వంఏర్పడుతుందా? ఏర్పడదా? అనే అనుమానాలు చాలా మందిలో కలిగాయి కూడా. తనకు డిప్యూటీ సిఎం పోస్టు



ఫడ్నవిస్

వద్దనీ, సిఎం పదవే కావా లనీ, కనీసం తొలి రెండున్నరేళ్లయినా ఇవ్వాలనీ షిండే డిమాండ్ చేసినట్లుగా వార్తలు వినిపించాయి. తాను మాత్రం ఏం తక్కువ తిన్నానని అనుకొంటూ సిఎం పదవి ముగ్గురికి రొటేషన్‌అయినా తప్పులేదనే అభిప్రాయం అజిత్ పవార్ వ్యక్తం చేసినట్లుగా ప్రచారంలోకి వచ్చింది. చాలా మృదువుగా వ్యవహారం సాగుతుందనుకొన్న సమయంలో చాలా జటిలంగా మారేసరికి తొమ్మిదో రోజు కూడా వచ్చేసింది. ఈలోగా అమిత్‌షా ముంబాయిలోని మూడు 'అధికార పక్షా'లను ఢిల్లీకి పిలిపించి బుజ్జగించారో, బెదరించారో తెలియదు గాని, డిసెంబర్ 5న కొత్తప్రభుత్వ ప్రమాణస్వీకారమంటూ ప్రకటించేశారు. అప్పటికి కూడా బిజెపి ఫడ్నవిస్ పేరును అధికారికంగా ప్రకటించలేకపోయింది. అలిగిన షిండే స్వగ్రామానికి వెళ్లిపోయి, ఎవరికీ దొరక కూడా రెండు రోజులు గడిపేసరికి రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. అమిత్ షా మళ్లీ షిండేను ఢిల్లీ పిలిచి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈసారి ఆ ప్రయత్నం ఫలించి తనకు డిప్యూటీ సిఎం ఇచ్చినా అంగీకారమే అంటూ షిండే ప్రకటించి బేషరతుగా ఫడ్నవీస్‌కు మద్దతునిచ్చారు. షిండేవైఖరి గమనించినఅజిత్ తానుకూడా అదే బాట పట్టినట్లు ప్రకటించారు. దానితో నాలుగువ తేదీన బిజెపి ఎమ్మెల్యేలు ఫడ్నవిస్‌ను లేజిస్టేచర్ పార్టీ నేతగా ఎన్నుకొన్నారు. తర్వాత వారు ముగ్గురూ కలిసి గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతిని కోరారు. అక్కడితో 'అసంతృప్తి' కథ ముగిసింది కానీ అది రంగు మార్చుకొని మరో మలుపు తిరిగింది. ఇప్పుడు ఎవరికి ఏయే పదవులు ఇవ్వాలి, ఎన్నెన్ని ఇవ్వాలన్నది పెద్దసమస్యగామారింది. మూడు పార్టీలకు ఉన్న సీట్లప్రకారం న్యాయంగా చూస్తే ముఖ్యమైన పదవులు, మెజారిటీ పదవులు బిజెపికే వెళ్తాయి. కానీ తనకు తన అనుచరులకు కీలకమైన పదవులను షిండే డిమాండ్ చేస్తుండడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లయింది. గత బుధవారం గవర్నర్‌ను కలిసివచ్చిన తర్వాత ఫడ్నవిస్, షిండే, అజిత్‌లు మీడియాతో మాట్లాడారు కానీ ముగ్గురి మాటల మధ్యన పొంతనే కనిపించలేదని విశ్లేషకులు అంటున్నారు. మూడు పార్టీలమధ్య పైకి పొత్తుకనిపించినా, అంతర్గతంగా ఎవరిదారి వారిదే అన్నట్లుగానే కనిపిస్తున్నాయి. ఈ అవకాశాన్నివినియోగించుకోవాలని విపక్ష కూటమి ప్రయత్నాలు ఆరంభించింది. ఆ కూటమిలోను ప్రధానంగా ఉన్నవి మూడుపార్టీలే. కాంగ్రెస్‌కు జోడీగా ఉద్ధవ్ శివసేన, పవార్ ఎన్సీపి ఉన్నాచాలా తక్కువ సీట్లు రావడంతో నిశ్శబ్దంగానే ఉన్నాయి. అయితే 'మహాయుతి'లో లుకలుకలు చూసి పవార్ మళ్లీ పాచికలు కదుపుతున్నట్లుగా కనిపిస్తోంది. ఒక దశలో ప్రభుత్వానికి బయటినుంచి మద్దతు ఇస్తామన్న షిండే నిజంగా బయటకువస్తే అజిత్ గ్రూపు కూడా బిజెపితో ఉండక పోవచ్చు. బిజెపికి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల అవకాశం లేకపోవడంతో షిండే, అజిత్‌ల డిమాండ్లకు తలొగ్గవలసిన పరిస్థితే కనిపిస్తుంది. ●

---

బుర్కినాఫాసో

# తిరుగుబాటు కూటముల్లో పశ్చిమాఫ్రికా

**గన్ని మోహన్**

ప్రపంచదేశాల్లో అశాంతి, అస్థిరత, ప్రహింస ప్రజ్వరిల్లిపోతున్నాయి. మధ్యప్రాచ్యంలో ఇరాన్, లెబనాన్, సిరియా, ఇజ్రాయెల్, ఉక్రెయిన్, మైన్మార్, బంగ్లాదేశ్ ఇలా చెప్పుకుంటూపోతుంటే ఎన్నో దేశాల్లో అస్థిరత, అశాంతి పెరిగిపోతున్నాయి. కారణాలు ఏవైనా, అందుకు మూలాలు మాత్రం అధికార దాహం, పదవీకాంక్షలేనని చెప్పకతప్పదు. మరో పక్క సామ్రాజ్య విస్తరణ కాంక్షకూడా రానురాను విస్తరిస్తోంది. సరిహద్దు వివాదాలు పరిష్కారం కాని దేశాలు ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి. ఇక ఆఫ్రికా ఖండంలోని దేశాలైతే ప్రత్యేకంగా మనం చెప్పుకోనవసరంలేదు. బుల్లెట్ ద్వారానే ఏదైనా సాధిస్తాం అనే సిద్ధాంతంలో పోతుంటాయి. తాజాగా ఆఫ్రికా ఖండంలోని పశ్చిమాసియా దేశం బుర్కినాఫాసోలో పరిస్థితి ఇదే విధంగా ఉంది. సైనిక పాలనలో ఉన్న బుర్కినాఫాసోలో మిలిటరీ అధినేత ప్రధానిని తొలగించి ఆదేశ ప్రభుత్వాన్ని రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు. రాజధాని ఔగాడౌగులో మిలిటరీ అధినేత కార్యాలయం నుంచే ఈప్రకటన వెలువడింది. ప్రధాని అపోలినేర్ జోచిమ్ క్యేలేమ్‌డే తంబేలాను ఉన్నట్లుండి డిస్మిస్‌చేసారు. మిలిటరీ అధినేత ఇబ్రహీమ్ ట్రావోర్ మాట్లాడుతూ రద్దుచేసిన ప్రభుత్వంలోని అధికారులు ప్రభుత్వశాఖల అధిపతులు కొత్తప్రభుత్వం ఏర్పాటయ్యేంతవరకూ అవే బాధ్యతలు కొనసాగిస్తారని ప్రకటించారు. ప్రభుత్వంరద్దు, ప్రధానిని డిస్మిస్‌చేయడానికి కల కారణాలను మాత్రం స్పష్టం చేయలేదు. దేశంలో ఏర్పడిన జుంటా పాలన 2022 సెప్టెంబరులో అధికారం హస్తగతంచేసుకుంది. అప్పటి మిలిటరీ అధినేత లెఫ్టినెంట్ కల్నల్‌పాల్ హెన్రీ డామిబా నుంచి పాలనాపగ్గాలు లాగేసుకుంది. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన అధ్యక్షుడు రోచ్‌మేరే కబోర్‌ను గద్దెదించి తిరుగుబాటుతో సాధించిన సైనిక పాలన ప్రస్తుతం నడుస్తోంది. మిలిటరీ కనుసన్నల్లోనే ప్రస్తుతప్రధాని నడిచినప్పటికీ హఠాత్తుగా ఆయన్ను తొలగించడం వెనుక కారణాలు మాత్రం అంతుబట్టకుండా ఉన్నాయి. ఇప్పటికే దేశం కడుపేదరికంలో ఉంది. 90 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నారు. ప్రధాన పంటలుగా పత్తి ఇతరత్రా వాణిజ్యపంటలు మాత్రమే సాగవుతాయి. ఇతర చిన్నచిన్న దేశాలకు ఎగుమతి చేస్తున్నప్పటికీ అశాంతి ఆర్థిక బలహీనతలతో మహిళల జనాభా ఎక్కువ పెద్రతోవ పడుతున్నట్లు ఆదేశ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. భద్రతాపరమైన అంశాల్లో గత ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు అనుసరించిన తీరుపై అసంతృప్తి ఉన్నమిలిటరీ అధిపతులు ఈ ప్రభుత్వాలను కూల్చివేసి పాలన తమచేతుల్లోకి తీసుకుంటున్నారు. అలాంటి దేశాల్లో ఇప్పుడు ఈ బుర్కినాఫాసో కూడా చేరింది. అయితే భద్రతాపరమైన సవాళ్లను అధిగమించే లక్ష్యంతో పాలన చేపట్టిందో ఆ లక్ష్యాల సాధనలో మిలిటరీ ప్రభుత్వం విఫలం అవుతోంది. అల్‌ఖైదా అనుబంధ సంస్థలు, ఇస్లామిక్‌స్టేట్



ఇబ్రహీం ట్రావోర్

గ్రూప్ ఉగ్రవాదులు దాడులతో బుర్కినాఫాసోను రక్తసముద్రంగా మార్చేసారు. వేలాదిమంది ఇటీవలి కాలంలో ఉగ్రదాడులకే బలయిపోయారు. సుమారుగా 20 లక్షలమంది వరకూ నిరాశ్రయులై పొరుగుననే ఉన్న చిన్నచిన్న దేశాలకు వలసలు పోయారు. వీరిలో కౌమారదశలో ఉన్న యువతులే అత్యధికంగా ఉన్నారు. వాస్తవానికి బుర్కినా ఫాసోలో ఆదేశ పార్లమెంటు ఆమోదించిన రాజ్యాంగం అమలులో ఉంది. నేషనల్ అసెంబ్లీ, ఆర్మీ అధికారులు, పౌరసంఘాల గ్రూపులు, సాంప్రదాయంగా ఉన్న మతపరమైన నాయకులు ఆమో దంతోనే ఇక్కడ రాజ్యాంగం అమలవుతోంది. ఎన్నికలు నిర్వహించాలని పశ్చిమాసియా ప్రాం తీయ కూటమి ఆఫ్రికా దేశాల ఆర్థికకూటమి (ఎకోవాస్) ఒత్తిడిచేస్తుండటంతో దేశంలోని మిలిటరీ జుంటా జులైలో ఎన్నికలు నిర్వహించాలని భావించింది. తద్వారా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వంతీసుకురావాలన్న లక్ష్యంకూడా ఉంది. అయితే మే నెలలోనే ఈ జుంటా పాలకులు తమ పాలనను మరో ఐదేళ్లపాటు పొడిగించుకున్నారు. దీన్నిబట్టి చూస్తే ఒకఅధ్యక్షుడి పదవీకాలంఐదేళ్లపాటు కొనసాగుతుంది. అవసరమనిపిస్తే మిలిటరీ తన సొంతరాజ్యాంగంతో మరో ఐదేళ్లుఅయినాకొనసాగేందుకు హక్కులు కలిగిఉంది. పొరుగుననేఉన్న నైగర్, మాలి దేశాల్లో కూడా ఇలాగే మిలిటరీ తిరుగుబాటుతోనే సైనికపాలనలు కొనసాగుతున్నాయి. సైనికపాలన పొడిగించుకుంటూపోతున్నాయి. అయితే బుర్కినాఫాసో మాత్రం అభివృద్ధి వైపు అడుగులువేయాలన్న లక్ష్యంతో ఈ సైనికపాలన దేశాలతో తెగ తెంపులుచేసుకుంది. అలాగే వందల ఏళ్లపాటు తమను పాలించిన సామ్రాజ్యవాద పాలకులు ఫ్రాన్స్, ఆఫ్రికా కూటమి ఎకోవాస్‌తో కూడా తెగతెంపులుచేసేసుకుని స్వతంత్రంగా నిలబడాలని భావిస్తోంది. ఇప్పుడున్న మిలిటరీ ప్రభుత్వం ఆదిశగానే అడుగులు వేస్తోంది. దేశం మొత్తం జనాభా 2.3 కోట్లకు మించిలేదు. మాలి, నైగర్, బెనిన్, టోగో, ఘనా, ఐవరీకోస్టు దేశాల సరిహద్దులుగా ఉన్నఈ దేశం కడుపేదరికంలో ఉందనేచెప్పాలి. తలసరి ఆదాయం 900డాలర్లకు మించిలేదు. ఆదేశ జిడిపి కూడా 21.1బిలియన్ డాలర్లుగాఉంది. ఆర్థికవృద్ధి వైపు అడుగులువేసేందుకు పెద్దదేశాలతో మైత్రీ బంధం పెంచుకోవాల్సిందిపోయి ఈ చిన్న దేశాల్లో అధికారదాహం పెరిగిపోయి తరచూఇలాంటి తిరుగుబాట్లకు దారితీస్తున్నాయి. పశ్చిమాఫ్రికా దేశాల్లో ఈతరహా తిరుగుబాట్లు అత్యంత సాధారణంగా మారిపోయాయి. ప్రధానంగా ఇస్లాం, క్రిస్టియన్ మతాలతోపాటు అనిమిజం అనే గిరిజనతెగ కూడాఇక్కడ ప్రాచుర్యంలోఉంది. అల్‌ఖైదా, ఐసిస్ వంటి వాటి ప్రాబల్యం ఈదేశంపై అత్యధికంగా ఉండటంతో ఈదేశం దుర్భర దారిద్ర్యంనుంచి ఇప్పటికీ బయట పడలేకపోతున్నదని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఉగ్రమూకల చెర నుండి బయటపడితేనే ఇలాంటి దేశాలకువిముక్తి కలుగుతుంది. కానీ అదెప్పుడు ఎలా ఏపరిస్థితికి దారితీస్తుందనేది మిలిటరీపాలకులకే తెలుసు. ●


---

# ప్రజాకాంక్షల దిశగా ఏడాది పాలన



బోరెడ్డి అయోధ్యరెడ్డి

తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేసుకున్నది. ప్రజా ప్రభుత్వం ఈ సంవత్సర కాలంలో అనేక సంచలనాత్మక నిర్ణయాలను తీసుకున్నది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించింది. రాష్ట్రంలో నిరంకుశ పాలనకు పాతరేసి, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించింది. దొరల పాలనను అంతం చేసి ప్రజాపాలనను తెచ్చింది. కెసిఆర్ కుటుంబం గుప్పిట్లో బందీ అయిన తెలంగాణకు విముక్తి కల్పించింది. కవులు, కళాకారులకు గౌరవాన్ని కల్పించింది. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలుకు తీవ్రంగా కృషి చేసింది. తెలంగాణ వస్తే తమకు ఉద్యోగాలు వస్తాయని బలిదానాలు చేసిన యువతకు ఉద్యోగాలు కల్పించింది. హైదరాబాద్ నగర అభివృద్ధికి విస్తృత ప్రణాళికలు రచించింది. మహిళాభివృద్ధికి, వారి ఉపాధికి బాటలు పరిచింది. యువ వికాసం కోసం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసింది. ప్రతిపక్షాలు ఈ ప్రభుత్వాన్ని కూలదోయటానికి, అస్థిరపరచడానికి అడగుడుగునా ఆటంకాలు కల్పిస్తున్నా లెక్క చేయకుండా ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికోసం నిరంతరం కృషి చేస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం గత సంవత్సరం డిసెంబర్ 7న కొలువు తీరేనాటికి రాష్ట్ర పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నది. రాష్ట్రం రూ.7లక్షల కోట్ల అప్పుల భారంమోస్తున్నది. బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రంలోని వ్యవస్థలన్నింటినీ చెరబట్టారు. రాష్ట్రంలో అవినీతి విలయ తాండవం చేస్తున్న పరిస్థితి. రుణమాఫీకాక, గిట్టుబాటు ధర రాక రైతులు అవస్థలు పడ్డారు. ఎన్నో ఆశలతో ఏర్పడ్డ రాష్ట్రంలో ఉద్యోగాలురాక యువత నిరాశ, నిస్పృహలకు లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రాష్ట్ర పాలనా కేంద్రమైన సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి నెలకొల్పారు. ప్రభుత్వం ఏర్పడిన రెండవ రోజు నుంచే ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలుకు శ్రీకారం చుట్టారు. సమాజానికి వెన్నెముకలాంటి యువతకు ఏడాది కాలంలోనే 55,143 ఉద్యోగాలు ఇచ్చి చరిత్రలోనే రికార్డు సృష్టించారు. సంక్షేమ కార్యక్రమాల కోసం ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.61,194 కోట్లు ఖర్చుచేసింది. ఇచ్చిన మాట ప్రకారం రైతులకురూ.2లక్షలు రుణమాఫీ చేసింది. రాష్ట్రంలోని 25.36 లక్షల మంది రైతులకు రూ.20,677కోట్లు రుణమాఫీ కోసం చెల్లించింది. పెట్టు బడి సాయంగా రైతులకు రూ.7,625కోట్లు, రైతులకు పవర్ సబ్సిడీ కోసం రూ.11,141 కోట్లు, రైతు బీమా కోసం రూ.1,514 కోట్లు, రైస్ సబ్సిడీ కోసం రూ.1,647 కోట్లుకింద మొత్తం రైతులకు సంవత్సరకాలంలో రూ.57 వేల కోట్లు ఖర్చుచేసి రైతుప్రభుత్వంగా కాంగ్రెస్ నిరూపించుకుంది. సన్నవడ్లకు ప్రతిక్వింటాకు బోనస్ కింద రూ.500లు ప్రభుత్వం చెల్లిస్తున్నది. దీని కారణంగా రైతులకు ఎకరాకు రూ.12వేల నుంచి రూ.15వేలవరకులబ్ధి చేకూరుతున్నది. రికార్డుస్థాయిలో దేశ చరిత్రలో ఏప్రభుత్వం చెయ్యని విధంగా రూ.2లక్షలు రుణమాఫీచేసింది. అలాగే రాష్ట్రంలో ప్రభుత్వం కులగణన చేపట్టింది. ఈ కులగణన దేశానికే దిక్సూచిగా మారుతుందనడంలో సందేహంలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలనెత్తిన రూ.7లక్షల కోట్ల అప్పులు రుద్దిదిగిపోయింది. ఈ అప్పుల భారం ప్రస్తుత ప్రభుత్వానికి గుదిబండగా మారింది. ఈ అప్పులకు నెలకు రూ. 6వేల కోట్లకు పైగా మిత్తీలతో ప్రభుత్వం కడుతున్నది. ఈ వడ్డీలు, కిస్తీల చెల్లింపుకొత్తగా చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అవరోధంగా మారాయి. అయినా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ ఒకటోతేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నది. ఇతర సంక్షేమ కార్యక్రమాలకు డబ్బుచెల్లిస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యోగులకు ఏ తేదీన జీతాలు వస్తాయో తెలియనిపరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం చక్కదిద్దింది. భారీవర్షాల కారణంగా పంటనష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేలుచొప్పున సుమారు రూ.100 కోట్లు నష్టపరిహారం చెల్లించింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి రూ.890 కోట్లు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకానికి రూ.442 కోట్లు, 200యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి



రూ.1234 కోట్లు, స్కాలర్ షిప్‌లు, ఇతర ఛార్జీలకోసం రూ.1016కోట్లు, మహిళలకు ఆర్టీసీబస్సుల్లో ఉచితప్రయాణానికి రూ.1375 కోట్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకానికి రూ.2,311కోట్లు ఖర్చుచేసింది. ఇదేగాక, బీసీ, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీల సంక్షేమంకోసం దాదాపు రూ.9,888కోట్లు ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం ఖర్చుచేసింది. గత ప్రభుత్వం చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టినబకాయిలను కూడా చెల్లించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వరిసాగులో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. గడిచిన వానాకాలంలో 66.7లక్షల ఎకరాల్లో వరిసాగు జరుగగా, 153లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. కాళేశ్వరం కార ణంగానే వరిలో అధిక దిగుబడి సాధ్యమైందని ఇన్నాళ్లు బీఆర్ఎస్ నాయకులు సాగించిన ప్రచారం అబద్ధమని దీనితో తేలిపోయింది. కాళేశ్వరం కూలిపోయి నీటిని నిల్వచేసే పరిస్థితి లేకపోయినా, రికార్డుస్థాయిలో వరి దిగుబడి రాష్ట్రం సాధించింది. విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంపొందించడానికి యంగ్‌ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రభుత్వం స్థాపించింది. కాలేజీల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు నైపుణ్యాలు లేక ఉద్యోగాలు సాధించలేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. కనుక వీరికినైపుణ్యాలు అలవరిచి ఉద్యోగాలు సాధించటానికి 57ఎకరాల విస్తీర్ణంలో యూనివర్సిటీని ప్రభుత్వం నిర్మిస్తున్నది. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరువాత ముచ్చర్లలో నాలుగవ నగర నిర్మాణానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారంచుట్టింది. న్యూయార్క్, సింగపూర్, దుబాయిల మాదిరిగా ముచ్చర్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ముచ్చర్లలో నెట్‌జీరో సిటీని నిర్మించాలని నిర్ణయించింది. దీనితో ఈ ప్రాంతపు రూపురేఖలే మారిపోతాయి. రాష్ట్రంలో 16 పెద్ద ప్రాజెక్టులు పెట్టుబడులు పెట్టాయి. వీటి ద్వారా 35,724 మందికి ఉపాధి లభించింది. ఇవేకాక ఫార్మారంగంలో రూ. 34వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరుగుతున్నాయి. దశాబ్దాలుగా మురికి కూపంగా మారి దుర్గంధం వెదజల్లుతూ, కాలుష్య కాసారంగా మారిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును ప్రభుత్వంచేపట్టింది. దీనితో నగర రూపురేఖలు మారిపోతాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి రంగంపైపదేళ్లలో రూ.1.81లక్షల కోట్లు ఖర్చు చేసినా కొత్త ఆయకట్టు సృష్టించలేదు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ తప్పు సరిచేయటానికి ప్రణాళికలు రూపొందించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.10వేలకోట్లు ఖర్చుచేసి 6.5లక్షల ఎకరాలకు నీరందించటానికి నిర్ణయించింది. తక్కువ ఖర్చుతో రైతులకు ఎక్కువ మేలు చేసేలా 6 ప్రాజెక్టులను తక్షణం పూర్తి చేయడానికి చర్యలు ప్రారంభించింది. అదేవిధంగా, వచ్చే నాలుగేళ్లలో 30లక్షల ఎకరాలకు సాగునీరు అందించటానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. 25 ఎకరాల స్థలంలో 29 జిల్లాల్లో రూ.300కోట్ల ఖర్చుతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రభుత్వం చేపట్టింది. ఇక్కడ సకల సౌకర్యాలతో విద్యార్థులకు విద్య, ౭నైపుణ్యాలను అందిస్తారు. రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాలు, వసతి గృహాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళల శిశుసంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలను 40శాతం పెంచారు. అదే విధంగా మహిళాభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం లెక్కలేనన్ని కార్యక్రమాలను ఈ సంవత్సర కాలంలో ప్రారంభించింది. అదేవిధంగా 2023 24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటాగా రూ.796 కోట్లు చెల్లించింది. ఇప్పటివరకు విదేశీ సంస్థ అయిన టెర్రాసిస్ చేతిలో ఉన్న ధరణి నిర్వహణ బాధ్యతను స్వదేశీ సంస్థ అయిన జాతీయ సమాచార సంస్థ (ఎన్ఐసీ)కి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 15,700 మెగావాట్లుగా ఉన్న కరెంట్ డిమాండ్‌ను ఏడేళ్లలో 27వేల మెగావాట్లకు చేరే అవకాశం ఉన్నది కనుక అందుకు తగినట్లుగా విద్యుత్ ఉత్పత్తి ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేసింది. బీఆర్ఎస్ మాదిరిగా కేంద్రంతో తగాదాలు పెట్టుకోకుండా, సత్సంబంధాలు ఏర్పరచుకోవడం ద్వారా ముఖ్యమంత్రి ఒకటికి పదిసార్లు కేంద్ర మంత్రులతో భేటీ అయి గడిచిన సంవత్సర కాలంలో రూ.50వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు రాష్ట్రానికి తెచ్చారు. కానీ ప్రజలు ఇవేవి పట్టించుకోకుండా సంక్షేమం, అభివృద్ధి జోడెడ్లుగా నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను సంపూర్ణంగా స్వాగతిస్తున్నారు. ●



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన వైమానికదళ ఎయిరోబాటిక్ బృందం సభ్యులు

# ఎయిర్‌షోకు భారీ ఏర్పాట్లు

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వైమానికదళ ఎయిరోబాటిక్ సభ్యులు

### ట్యాంక్‌బండ్‌పై ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆదివారం సచివాలయం, నెక్లెస్ రోడ్‌లో జరగనున్న వి జయోత్సవాల ముగింపును పురస్కరించుకుని వైమానిక దళం ఎయిర్‌షోకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వైమానిక దళ విభాగంలోని సూర్యకిరణ్ ఏరోబాటిక్ ఆధ్వ ర్యంలో ఈ ఎయిర్ షో జరగనుంది. ఇందుకు సంబంధించి ఏరోబాటిక్ గ్రూప్ కెప్టెన్ అజయ్ దాశరథి నేతృత్వంలోని పైలట్లు శనివారం నాడు సిఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎయిర్ షో జరిగే తీరుతెన్నులను ఏరో బాటిక్ బృందం గ్రూప్ కెప్టెన్ అజయ్ దాశరథి సిఎంకు వివరించారు. ఈ షోలో ఎన్ని విమా నాలు పాల్గొననున్నాయి, గతంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఎయిర్ షోలకు సంబంధించిన అంశాలను కూడా ఆయన వివరించారు. కాగా ఆదివారం నాటి ఎయిర్ షో పురస్కరించుకుని ట్యాంక్‌బండ్‌పై మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. ఈ ఎయిర్ షోను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చే వీలుండడంతో సచివాలయం, నెక్లెస్ రోడ్, ట్యాంక్‌బండ్, సంజీవయ్య పార్క్ మార్గాలలో భారీ పోలీసు బందోబ స్తును ఏర్పాటు చేశారు. ఈ ఎయి ర్ షోకు గవర్నర్ జిష్ణు దేవ్, సిఎం రేవంత్ రెడ్డి సహా మం త్రులు, ఎంఎల్ఎలు, ఎంపిలు, ప్రముఖులు రానుండడంతో అందుకు తగినట్లు ఏర్పాట్లు చేశారు. వేడుక లు జరిగే ప్రాంగణాన్ని పోలీసులు ఇప్పటికే తమ అదుపులోకి తీసుకున్నారు.

### ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా

# రేపు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

### లక్షలాదిమంది మహిళల హాజరు

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ఆదివారం నిర్వహించే ఎయిర్ షోకు భారీ సంఖ్యలో నగర ప్రజలు హాజరయ్యే అవకాశమున్నందున వచ్చేవారికి ఏవిధమైన ఇబ్బం దులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా 8న వైమానిక ప్రదర్శన, 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఏర్పాట్లపై శనివారం సచివాలయంలో ఉన్నతాధికా రులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిఏడి కార్యదర్శి రఘు నందన్‌రావు, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హరీష్, అడిషనల్ సిపి విక్రంజీత్ మాన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, విద్యా శాఖ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్బంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, భారతీయ వైమానిక దళం ఏర్పాటు చేస్తున్న ఎయిర్ షోలో తొమ్మిది సూర్యకిరణ్ విమానాలు పాల్గొంటాయని తెలిపారు. ఈ రకమైన విన్యాసం చేయగల సత్తా ప్రపంచంలో కేవలం 5 టీమ్‌లకు మాత్రమే ఉందని, అందులో ఒక టీమ్ హైదరాబాద్‌లో చేయడం వల్ల మన రాష్ట్రానికే గర్వ కారణమని సి.ఎస్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో పాటు, రాష్ట్ర మంత్రులు, వివిఐపిలు, వైమానిక దళానికి చెందిన సీనియర్ అధికారులు ఈ ఎయిర్ షో వీక్షించడానికి హాజరవుతున్నందున విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఎయిర్ షోలో సూర్యకిరణ్‌కు చెందిన తొమ్మిది విమానాలు పాల్గొంటాయని తెలిపారు. ఈ షోతోపాటు సాయంత్రం నిర్వహించే మ్యూజికల్ కాన్సర్ట్‌కు నెక్లెస్ రోడ్, పివి మార్గ్‌లలో భారీ సంఖ్యలో ప్రజలు హాజరవుతారని, వీరి సౌకర్యార్థం ఇప్పటికే ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఎయిర్ షో అనంతరం రాహుల్ సిప్లి గంజ్ మ్యూజికల్ కాన్సర్ట్ కార్యక్రమానికి కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశమున్నందున, తగు మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను చేపట్టాలని పేర్కొన్నారు.

**9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ**

ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు రోజైన 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు సచివాలయంలో తెలంగాణా తల్లి విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారని తెలిపారు. సచివాలయ ఆవరణలో జరిపే ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి లక్ష మంది పాల్గొంటారని, ఇందుకు తగు ఏర్పాట్లు చేయాలని సి.ఎస్ సూచించారు. ఆవిష్కరణ సందర్భంగా దాదాపు 150 మంది ప్రము ఖులు ఆసీనులయ్యేలా ప్రధానవేదికతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు మరోవేదిక ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యే స్వయం సహాయ బృందాలు మహిళలు, ఇతరులందరూ మధ్యాహ్నం నాలుగున్నరలోగా సభా ప్రాంగణానికి చేరు కునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. నెక్లస్ రోడ్, పీపుల్స్ ప్లాజా, గోశాలరోడ్, నిజాం కాలేజ్, పబ్లిక్ గార్డెన్‌లో పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేశామని నగర పోలీస్ అడిషనల్ కమిషనర్ విక్రంజీత్‌సింగ్‌మాన్ తెలిపారు.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై మరో కేసు

### మాసబ్‌ట్యాంక్ ఇన్స్‌పెక్టర్ ఫిర్యాదుతో

### గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), డిసెంబరు 7, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మీద మరోకేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు విషయంలో అరెస్టు చేసేందుకు వచ్చిన సమయంలో గురువారం కౌశిక్‌రెడ్డి తనమీద దురుసుగా ప్రవర్తిండంతో పాటు చనిపో తానని బెదిరించాడని మాసబ్ ట్యాంక్ ఇన్స్‌పెక్టర్ పరశురాం పిర్యాదు చేయడంతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇన్స్‌పెక్టర్ హాబీబుల్లాఖాన్ తెలిపిన ప్రకారం... డిసెంబరు 4వ తేదీన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో హుజురాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో పాటు మరో 20 మంది మీద కేసు నమోదు కాగా, ఈనెల 5వ తేదీన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని కొండాపూర్‌లోని కోల్లా లగ్జూరియా విల్లాస్‌లో అరెస్టు చేశారు. కాగా కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు విధుల్లో భాగంగా అతని ఇంటికి వచ్చిన మాసబ్‌ట్యాంక్ ఇన్స్‌పెక్టర్ పరశురాం విధులకు భంగం కలిగించడంతో పాటు అతని మీద దురుసుగా ప్రవర్తించి, ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో మాసబ్‌ట్యాంక్ ఇన్స్‌పెక్టర్ పరశురాం గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. ఈ పిర్యాదుపై కోర్టు అనుమతితో శుక్రవారం కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మీద ఈనెల 4వ తేదీన సైతం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్ విధులకు భంగం కలిగించడం, దురుసు ప్రవర్తన మీద కేసు నమోదు కాగా, 5వ తేదీన పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి బెయిలు మంజూరు కాగా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో తాజాగా మరో కేసు నమోదు కావడం విశేషం.



ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

# యేడాది పాలన ఎంతో సంతృప్తినిచ్చింది

### ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యం

### ఈ మట్టి చైతన్యమే స్ఫూర్తిగా, విరామం లేకుండా, విశ్రాంతి కోరకుండా ముందుకు సాగిపోతున్నా..

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 7:** ఏడాది ప్రజాపాలన ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. పోరాటాలను, ఉద్యమాలను, త్యాగాలను, ఆత్మ బలిదానాలను, ఆకాంక్షలను, ఆశయాలను అన్నింటినీ కలిపి రాసిన వీలునామాను గతేడాది డిసెంబర్ 7వ తేదీన తెలంగాణ తన చేతుల్లో పెట్టిందని సీఎం పేర్కొన్నారు. తన వారసత్వాన్ని సగర్వంగా, సమున్నతంగా ముందుకు తీసుకెళ్లే బాధ్యతను తనకు తెలంగాణ అప్పగించిందన్నారు. ఆ క్షణం నుంచి జన సేవకుడిగా, ప్రజా సంక్షేమ శ్రామికుడిగా మదిలో, విధిలో, నిర్ణయాల జడిలో సకల జనహితమే పరమావధిగా, జాతి ఆత్మ గౌరవమే ప్రాధాన్యతగా ముందుకు సాగిపోతున్నామంటూ ఎక్స్ వేదికగా రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారు. సహచరుల సహకారంతో, జనహితుల ప్రోత్సాహంతో, విమర్శలను సహిస్తూ, విద్వేషాలను ఎదురిస్తూ, స్వేచ్ఛకు రెక్కలు తొడిగి ప్రజాస్వామ్యానికి రెడ్‌కార్పెట్ పరిచినట్లు సీఎం వ్యాఖ్యానించారు. అవనిపై అగ్ర భాగాన తెలంగాణను నిలిపేందుకు గొప్ప లక్ష్యాల వైపు నడుస్తూ, 4 కోట్ల ఆశయాలను నడిపిస్తూ నిరంతరం జ్వలించే ఈ మట్టి చైతన్యమే స్ఫూర్తిగా, విరామం లేకుండా, విశ్రాంతి కోరకుండా ముందుకు సాగిపోతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. ఏడాది పాలనలో ఎంతో సంతృప్తిని ఇచ్చిందని, సమస్త ప్రజల ఆకాంక్షలను సంపూర్ణంగా నెరవేర్చడమే తన సంప్రాప్తి అని ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి తన ఏడాది పాలనపై హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు వేడుకలు

### ఫుడ్‌స్టాళ్లను ప్రారంభించిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 7:** ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నెక్లెస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాళ్లను శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మున్సిపల్ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్, జిఏడి కార్యదర్శి రఘునందన్, జీఏడీ ప్రోటోకాల్ డైరెక్టర్ వెంకట్ రావు తదితరులు పాల్గొన్నారు. పలు పసందైన వంటకాలతో ఫుడ్‌స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం, పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలంకరణతో మెరుస్తున్నాయి. నగరంలో ప్రసిద్ధి చెందిన పలు బ్రాండెడ్ హోటల్స్ ఈ ఫుడ్ స్టాళ్ళ కౌంటర్స్ ఏర్పాటు చేశాయి. హైదరాబాదీ బిర్యాని, మొగులాయి వంటకాలు, చాట్, ఐస్ క్రీం, నార్తన్ తదితర వెరైటీ ఫుడ్ స్టాళ్ళ ఏర్పాటు. హైదరాబాద్, మొగులాయి, తెలంగాణ, ఆంధ్ర వంటకాలతో పాటు బేకరి ఐటమ్స్ ఐస్ క్రిమ్ పార్లర్లను విజయోత్సవాల్లో పాల్గొనే సందర్శకుల సౌకర్యార్థం వందకు పైగా ఫుడ్ స్టాళ్లను అందుబాటులోకి తెచ్చారు. అంతర్జాతీయంగా పేరొందిన హైద్రాబాదీ దమ్ బిర్యాని తోపాటు మొగలాయి, జఫ్రాని బిర్యాని పర్యాటకులకు అందించేందుకు ప్రముఖ హోటళ్ళయిన ప్యారడైజ్, పిస్తా హౌజ్, షాదాబ్, బడేమియా కబాబ్ తదితర హోటళ్లు తమ బ్రాండ్ స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. వీటితోపాటు తెలంగాణ వంటకాలుగా పేరొందిన పాలమూరు గ్రీల్, తెలంగాణ విందు, అంకాపూర్ నాటు కోడి చికెను, ఫుడ్ జాయింట్స్ ను అందుబాటులోకి తెచ్చారు. నిలోఫర్ కెఫ్, బ్రౌన్ బేర్ బేకరిలు ఫ్రాంకిల్ మ్యాగి హాట్స్పాట్ కాంటినెంటల్ కాఫీ, ఫ్రాంకి అండ్ రోల్స్, మొమోస్ అండ్ ఫ్రైస్ తో పాటు గోకుల్ చాట్ కూడ తమ సంస్థ ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేసారు. వీటి,తో పాటు ఆగ్రా చాట్ అండ్ స్వీట్స్ స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇందిరా మహిళ శక్తి క్యాంటిన్లను కూడ ఏర్పాటు చేశారు.

**ఏర్పాట్లను పరిశీలించిన సమాచార శాఖ స్పెషల్ కమిషనర్**

ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా పి.వి.నర్సింహారావు మార్గ్ లో నరగంలోని ప్రముఖ హుటల్స్ ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేశాయి. 9 తేది వరకు ఈ స్టాళ్లు ఉంటాయి. హైదరాబాద్, మొగలాయి, తెలంగాణా, ఆంధ్ర వంటకాలతో పాటు బేకరి ఐటమ్స్ ఐస్ క్రిమ్ పార్లర్లను విజయోత్సవాల్లో పాల్గొనే సందర్శకుల సౌకర్యార్థం వందకు పైగా ఫుడ్ స్టాళ్లను అందుబాటులోకి తెచ్చారు. శనివారం సాయంత్రం వందేమాతరం శ్రీని వాస్ మ్యూజికల్ నైట్ నిర్వహించారు. ఐమాక్స్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో విశాలమైన స్టేజి నిర్మాణం, సౌండ్ సిస్టం తోపాటు సందర్శకులకు సీటింగ్ ఏర్పాట్లు పెద్ద ఎత్తున జరిగాయి. ఈ ఏర్పాట్లను సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ డా. హరీష్ తోపాటు శాఖ ఉన్నతాధికారులు దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. అంతర్జాతీయంగా పేరొందిన హైదరాబాదీ దమ్ బిర్యానితోపాటు మొగలాయి, జఫ్రాని బిర్యాని పర్యాటకులకు అంది చేందుకు ప్యారెడైజ్, పిస్తా హౌజ్, షాదాబ్, బడేమియా కబాబ్ తదితర హోటళ్లు తమ బ్రాండ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటితోపాటు తెలం గాణ వంటకాలుగా పేరొందిన పాలమార్ గ్రీల్, తెలంగాణ విందు, అంకా పూర్ నాటుకోడి చికెను, ఫుడ్‌జాయింట్స్‌ను అందుబాటులోకి తెచ్చారు.



# వ్యాపారి హత్యకేసును చేధించిన పోలీసులు

### తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమన్నందుకే హత్య... నలుగురి నిందితుల అరెస్టు

**హైదరాబాద్ (హయత్‌నగర్), డిసెంబరు 7, ప్రభాతవార్త:** హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 3న జరిగిన వ్యాపారి హత్యకేసును పోలీసులు చేధించారు. తీసుకున్న అప్పును తిరిగి ఇవ్వమని ఒత్తిడి చేయడంతో నిందితులు అతన్ని అంతం చేశారని పోలీసులు తెలిపారు. హయత్ నగర్ బాగ్యలత అరుణోదయ కాలనీలో నివాస ముండే యక్కలి కాశీరావు(37) సెకండ్ హ్యాండ్ కార్ల విక్రయాలు కొనసాగిస్తుం టాడు. అతను నివాసముండు ఇంటి పైఅంత స్తులో ఐతరాజు శంకర్, పెద్దగాని శేఖర్, పెద్దగాని సాయిలు సింగిల్ బెడ్‌రూం పోర్షన్‌లో అద్దెకు ఉండేవారు. కాశీరావుకు వారితో పరిచయం స్నేహంగా మారింది. కాశీరావు వద్ద వారు పెద్ద మొత్తంలో డబ్బును వడ్డీకి తీసుకున్నారు. తీసు కున్న డబ్బును వడ్డీతో సహా తిరిగి ఇవ్వమని కాశీరావు వారిని అడగ్గా వారు సరైన సమయానికి ఇవ్వలేక పోయారు. దీంతో కాశీరావు తన డబ్బుగురించి వారిపై ఒత్తిడి తీసుకువచ్చాడు. దీంతో కాశీరావును అడ్డుతొలగించుకుంటే డబ్బులు ఇవ్వాల్సిన అవసరం ఉండదని ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. వీరు ముగ్గురికి మరో స్నేహితుడు భవనసారి ప్రసన్నకుమార్ తోడయ్యాడు. కళ్లల్లో పెప్పర్ స్ప్రే కొట్టి గొంతుకోసి చంపాలని నిర్ణయించుకున్నారు. అనుకున్న ప్రకారం సర్జికల్ బ్లేడ్‌లను కొని ఇంట్లో తెచ్చిపెట్టుకున్నారు. 3వ తేదీన కాశీరావు డబ్బుకోసం వారి పోర్షన్‌లోకి వెళ్లగానే శంకర్ పెప్పర్ స్ప్రేకొట్టగా... శేఖర్, సాయి కదలకుండా కాశీరావు కాళ్లు పట్టుకున్నాడు. ప్రసన్నకుమార్ అతని చేతులు పట్టుకున్నాడు. శంకర్ సర్జికల్ బ్లేడ్‌తో అతని గొంతు కోస్తుండగా గొంతులో బ్లేడ్ ఇరుక్కుపోయింది. దీంతో మరో బ్లేడ్ తీసుకుని అతని గొంతుకోసి పరారయ్యారు. కాశీరావు భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈమేరకు ఈనెల 6న బొమ్మలగుడి సమీపంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద వారిని పట్టుకుని తమదైన శైలిలో విచారించగా వారు నేరం అంగీకరించారు. నిందితుల నుంచి హ్యుండాయ్ వర్ణాకారు, హోండా యాక్టివా బైక్, రెండు సర్జికల్ బ్లేడ్లు, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించారు.

# రేవంతన్నకు అభినందనలు

### ఎక్స్ వేదికగా ఎపిసిసి చీఫ్ షర్మిల ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 7:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఎక్స్ వేదికగా శనివారం అభినందనలు తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులకు ఆమె అభినందనలు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ అన్నకి, మంత్రులకు, ఎమెల్యేలకు, ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్తకు హృదయపూర్వక అభినందనలు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వంలో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ, సంక్షేమ, అభివృద్ధి రాజ్యంగా, తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే ధ్యేయంగా ముందుకు సాగడం అభినందనీయం. కాంగ్రెస్‌తోనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యం. హస్తమే దేశానికి అభయహస్తం అంటూ రాసుకొచ్చారు. రేవంత్‌రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావులను షర్మిల తన పోస్టుకు ట్యాగ్ చేశారు.

### కార్పొరేట్ కాలేజీల్లోని విద్యార్థుల ఆత్మహత్యలపై

# సమగ్ర విచారణ జరిపించాలి

### ఇంటర్ బోర్డు ముందు ఎస్ఎఫ్ఐ ధర్నా

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థల్లో జరుగుతున్న వరుస ఆత్మహత్యలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. కార్పొరేట్ కాలేజీలపై విజిలెన్స్ దాడులు నిర్వహించాలని, అనుమతులు లేకుండా నడుస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇంటర్ బోర్డు ముందు ఎస్ఎఫ్ఐ ధర్నా చేపట్టింది. ధర్నా కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు దామెర కిరణ్, కె.అశోక్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, చరణ్రశ్రీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివ తదితరులు పాల్గొన్నారు. ఇంటర్ బోర్డు అధికారులు కార్పొరేట్ విద్యాసంస్థలతో మిలాఖత్ కావడంపై విజిలెన్స్ దాడులు జరిపి.. అధికారుల అవినీతి పై చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థల్లోని విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ ఇంటర్ అధికారులు, ప్రభుత్వం స్పందించడం లేదని వారు మండిపడ్డారు. ధర్నా అనంతరం రాష్ట్ర ఇంటర్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్యకు వినతిపత్రం అందజేశారు.

# రేపు ఎల్ఐసి బీమా సఖీని ప్రారంభించనున్న పిఎం

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** ఎల్ఐసీ కొత్తగా అందుబాటులోకి తెస్తున్న బీమా సఖీ యోజన పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించనున్నారు. ఈ నెల 9న హర్యానాలోని పానిపట్‌లో ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు ఎల్ఐసి శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇది వికసిత్ భారత్ దిశగా మహిళలను సుసంపన్నులను చేయడంపై దృష్టిసారించేందకు అమలు చేయనుంది.

# అంబులెన్సు దొంగతనం!

### సినీపక్కీలో చేజ్‌చేసి పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్ (హయత్‌నగర్), డిసెంబరు 7, ప్రభాతవార్త:** హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏకంగా దుండగుడు అంబులెన్సును చోరీ చేశాడు. పైగా... పోలీసులు నిందితు డిని సినీపక్కీలో వెంబడించి పట్టుకోవడానికి యత్నించగా అడ్డొచ్చిన వాహనాలను పోలీసు లను ఢీకొ డుతూ సూర్యాపేట వరకు వెళ్లిపోయాడు. శని వారం తెల్లవారు జామున ఎల్.బి. నగర్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుడిని 108 అంబులెన్సు డ్రైవర్ రంగారి మోహన్‌రెడ్డి, టెక్నీషియన్‌లు హయత్‌నగర్‌లోని సన్‌రైజ్ ఆసుపత్రిలో చేర్పించారు. బయటకు వచ్చి చూసేసరికి వారి అంబులెన్సు కన్పించపోగా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దుండగుడు అంబులెన్సుతో సూర్యాపేటవైపు వెళ్తున్నట్లు గుర్తించి వెంబడించారు. అంబులెన్సును చోరీచేసిన డ్రైవర్ చిట్యాలలో ఏఎస్ఐ జాన్‌రెడ్డిను ఢీకొట్టి వెళ్లిపోయాడు. కేతేపల్లి వద్ద టోల్‌ప్లాజా గేటును ఢీకొట్టి పరారయ్యాడు. చివరకు టేకుమట్ల వద్ద పోలీసులు లారీలను అడ్డుపెట్టగా అంబులెన్సు రోడ్డు పక్కన దిగువ ప్రాంతంలో ఆగిపోయింది. గాయపడిన జాన్‌రెడ్డి పరిస్థితి సీరియస్‌గా ఉందని పోలీసులు తెలిపారు. అంబులెన్సును అపహరించినది రావుల వెంకటేశ్వర్లుగా అలియాస్ కాలభైరవగా గుర్తించారు. అతని మానసిక స్థితి కూడా సరిగా లేనట్లు కన్పిస్తోంది.




### రేపటి నుంచి అందుబాటులో హాల్‌టికెట్లు

# 1,368 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు

### రెండు సెషన్‌ల్లో పరీక్షల నిర్వహణ

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 15, 16 తేదీల్లో జరగనున్న గ్రూప్-2 పరీక్షల కోసం 1368 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకి సంబంధించిన హాల్ టికెట్లను రేపటి(సోమవారం) నుంచి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అందుబాటులోకి తీసుకురానుంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లోనూ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలను నిర్వహిస్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి టీజీపీఎస్‌సీ నోటిఫికేషన్ నంబర్ 29/2022ను డిసెంబర్ 29, 2022న జారీ చేసింది. గ్రూప్-2 పోస్టులకి రాష్ట్రంలోని 5.51లక్షల మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 15, 16 తేదిల్లో ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు.. తిరిగి సాయంత్రం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. డిసెంబర్ 15న ఉదయం పేపర్-1 పరీక్ష .. జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీపై ఉంటుంది. మధ్యాహ్నం నిర్వహించే పేపర్-2 పరీక్ష.. హిస్టరీ, పాలిటీ అండ్‌న సొసైటీ పరీక్ష ఉంటుంది. డిసెంబర్ 16న ఉదయం పేపర్-3 పరీక్ష .. ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్షను నిర్వహించనుండగా.. మధ్యాహ్నం పేపర్-4 పరీక్ష .. తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ ఫార్మేషన్‌పై ఉంటుంది. పరీక్షలకి సంబంధించి అరగంట ముందుగానే పరీక్షా కేంద్రం గేట్లను మూసివేయనున్నట్టు టీజీపీఎస్‌సీ స్పష్టం చేసింది. హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌కి సంబంధించి సాంకేతిక సమస్యలు ఏమైనా ఉంటే కమిషన్ కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్ నంబర్ 040-2354 2185 లేదా 040-23542187 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# సైబర్ నేరగాళ్ల కట్టడికి పోలీసుల కొత్త వ్యూహం

### మ్యూల్ ఖాతాలపై నిఘాకు ఆర్‌బిఐ సహకారంతో బ్యాంకులకు మార్గదర్శకాలు జారీకి నిర్ణయం

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** విదేశాల్లో వుంటూ భారత్‌ను టార్గెట్ చేస్తూ అనేక పద్దతుల్లో నిత్యం పదుల కోట్ల రూపాయలను దోచుకుంటున్న సైబర్ నేర గాళ్ల భరతం పట్టేందుకు రాష్ట్ర పోలీసులు కొత్త వ్యూహాన్ని ఎంచుకున్నారు. విదేశీ నేరగాళ్లకు సహకరిస్తూ వారికి తమ పేరిట వున్న బ్యాంకు ఖాతాలు ఇస్తున్న లోకల్ కేడీలపై నిఘా వుంచేందుకు బ్యాంకులకు ఆర్‌బిఐ సహకారంతో మార్గదర్శకాలు జారీ చేసేందుకు నిర్ణయించారు. ఇదే సమయంలో సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న బ్యాంకు అధికారులపైనా నిఘా వుంచేందుకు ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసుకోవాలని బ్యాంకింగ్ రంగానికి పోలీసులు సిఫార్సు చేసేందుకు నిర్ణయించారు. రాబోయే రోజుల్లో సైబర్ నేరాలు అతి పెద్ద సమస్యగా మారనున్న నేపథ్యంలో ఈ విషయంలో మ్యూల్ ఖాతాల (సైబర్ నేరగాళ్ల లావాదేవీలకు అందుబాటులో వుండే ఖాతాలు )పై నిరంతరం నిఘా వుంచాలని పోలీసు అధికారులు బ్యాంకుల యాజమాన్యాలను కోరసాగారు. ఇప్పుడిప్పుడే వేళ్లూనుకుంటున్న సైబర్ నేరాల కట్టడికి వెంటనే కఠిన చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో ఇది నివారించేందుకు వీలు కాలేని విధంగా తయారవుతుందని పోలీసు అధికారులు చెబుతున్నారు.

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్, జోయ్‌పూర్, నాగ్‌పూర్‌లలో వుండే 27 మంది సైబర్ నేరగాళ్లను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇటీవల అరెస్టు చేయడం తెలిసి ందే. రాజస్తాన్‌లోని అనేక ప్రాంతాలు సైబర్ నేరగాళ్లకు నిలయమన్న విషయం విదితమే. ఇంతకు ముందు ఇక్కడ వుండే నేరగాళ్లు నేరుగా భారత్‌లోని అనేక నగరాల కు చెందిన వారిని అనేకరకాలుగా మోసం చేసి అందినంతా దండుకునే వారు. అయితే కొంతకాలంగా దీనికి బదులు విదేశాల్లో వుండే సైబర్ నేరగాళ్లకు వీరు సహకరి స్తూ వారి వద్ద నుంచి ఐదు నుంచి పది శాతం కమీషన్ తీసుకుంటున్నారు. దుబాయ్‌తో పాటు పలు ఆఫ్రికా దేశాలు, వియత్నాం, చైనా, మియన్మార్, కాంబోడియా దే శాలలో తలదాచుకున్న పేరుమోసిన అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లకు రాజస్తాన్‌తో పాటు మరికొన్ని రాష్ట్రాలకు చెందిన లోకల్ కేడీలు తమ బ్యాంకు ఖాతాలను (వీటిని మ్యూల్ ఖాతాలుగా చెబుతారు) ఇస్తూ సైబర్ నేరాల ద్వారా కాజేసిన నగదును విదేశాలకు మళ్లించేందుకు సహకరిస్తున్నారు. హైదరాబాద్‌లోనూ ఇటీవల ఇలాంటి త ప్పుడు పనులకు పాల్పడి విదేశాల్లో వుండే బడా నేరగాళ్లకు తమ బ్యాంకు ఖాతాలు ఇచ్చిన పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేరగాళ్లు కొన్నేళ్లుగా భారత్‌లో జ రిగిన 2223 సైబర్ నేరాలలో నిందితులు కాగా, 11 కోట్ల రూపాయల లూటీలో పాలుపంచుకున్నారు. ఇక గుజరాత్ గత ఏడాది కూడా పదుల సంఖ్యలో ఈ తరహా సైబర్ నేరగాళ్లను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. విదేశాల్లో వుండే బడా నేరగాళ్లకు లోకల్ కేడీలు కమీషన్ కోసం బ్యాంకు ఖాతాలతో పాటు తమ పేరిట వు న్న సిం కార్డులు, బ్యాంకు పాస్ పుస్తకాలు, చెక్ బుక్కులను ఇస్తుండడం ఇటీవల కాలంలో బాగా పెరిగిపోయింది. ఈ తరహా నేరగాళ్లు భారత్‌లో వందల సంఖ్యలో వున్నారని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పరిశీనలో తేలింది. ఇందులో రాజస్తాన్, గుజరాత్‌తో పాటు ఢిల్లీ, యుపిలో ఎక్కువగా వుండగా దీని తరువాత హైద రాబాద్‌లోనూ ఇటీవల బాగా పెరిగిపోయారు. విదేశాల్లో వుండే సైబర్ నేరగాళ్లకు తమ బ్యాంకు ఖాతాలు ఇస్తున్న వారిలో దినసరి కూలీలు, చిన్నపాటి వ్యాపారులు, నిరుద్యోగులు, చిరుద్యోగులే ఎక్కువగా వుంటున్నారు. వీరంతా కరెంటు ఖాతాలు తెరుస్తూ అందులో కొంతకాలం ఐదు వేల రూపాయలకు మించి వుంచకుండా చూడ డం ఒక ఎత్తయితే ఆ తరువాత నెల నుంచి రెండు నెలల మధ్య లక్షలాది రూపాయల నుంచి కోట్లాది రూపాయల లావాదేవీలు జరపడం మరో ఎత్తు. సరిగ్గా ఇదే అంశాన్ని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు బ్యాంకుల యాజమాన్యాలకు లేఖ రాయనున్నారు. బ్యాంకుల్లో సాదాసీదా లావాదేవీలు సాగే కొన్ని ఖాతాలలో వున్నట్లుండి కోట్లాది రూపాయల నగదు బదిలీ జరుగుతుందంటే బ్యాంకులు అనుమానించాలని, ఇందులో ఏమాత్రం తేడాగా అనిపించినా ఆ ఖాతాలను వెంటనే జప్తు చేయాలని పోలీసు అధికారులు కోరనున్నారు. ఈ విషఫయంలో బ్యాంకింగ్ విజిలెన్స్ క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆర్‌బిఐని పోలీసులు కోరుతున్నారు. ప్రతీ బ్యాంకు లో ఇటువంటి ఖాతాలు వుండే అవకాశం వుండవని, కేవలం కొన్నింటిలోనే వుంటాయని, సాదాసీదా లావాదేవీలు సాగే ఖాతాలలో వున్నట్లుండి కోట్లాది రూపాయల బదిలీలు జరిగితే విజిలెన్స్ విభాగం కచ్చితంగా అనుమానించాలని పోలీసు అధికారులు కోరుతున్నారు. ఇది కొంత కష్టమైన పనే అయినా అనుమానిత ఖాతాలపై ని ఘా వుంచేందుకు బ్యాంకింగ్ విజిలెన్స్ విభాగానికి అధికారాలు వున్నందున ఈ పనిని ఆ విభాగం కచ్చితంగా చేబడితే విదేశాల్లో వుండే బడా సైబర్ నేరగాళ్లకు సహ కరించే లోకల్ నేరగాళ్లను సులభంగా పట్టుకోవచ్చని, తద్వారా సైబర్ దోపిడిని చాలా వరకు నివారించవచ్చని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు భావిస్తున్నారు. ఈ విషయమై బ్యాంకుల యాజమాన్యాలకు లేఖలు రాసేందుకు నిర్ణయంచారు. ఇదే విషయమై ఆర్‌బిఐకి కూడా లేఖ రాయాలని నిర్ణయించారు.

# యాదాద్రి థర్మల్ ప్రాజెక్టు యూనిట్-2 జాతికి అంకితం

## పైలాన్ ఆవిష్కరణ

### పవర్‌ప్లాంట్‌లో 53 నిమిషాలు అధికారులతో మాట్లాడిన సిఎం రేవంత్‌రెడ్డి



పవర్‌ప్లాంట్ అధికారులతో సిఎం రేవంత్‌రెడ్డి తదితరులు

**మిర్యాలగూడ, డిసెంబరు 7 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చేందుకు కీలకమైన యాదాద్రి విద్యుత్ కేంద్రాన్ని శనివారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జాతికి అంకితం చేశారు. విద్యుత్ కేంద్రంలో 2వ యూనిట్‌ను ప్రారంభించిన ఆయన మొత్తం 4000 మెగావాట్ల సామర్థ్యం గల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఒకటి, రెండు యూనిట్లలో విద్యుత్ ఉత్పాధన ప్రారంభమై వాణిజ్య ప్రాతిపదికన రాష్ట్ర అవసరాలు తీర్చేందుకు విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేసే ప్రక్రియను అధికారికంగా 2వ యూనిట్‌ను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద సుమారు 30వేల కోట్ల అంచనాలతో దేశంలోనే మొదటిసారి ఒకే చోట 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే 5 యూనిట్లను 4,276 ఎకరాల్లో 2017లో పనులు ప్రారంభించి 2021లోగా పూర్తి చేయాల్సినప్పటికీ కరోనా కారణంగా పనులు అలస్యం కావడంతో వచ్చే మార్చి అఖరు నాటికి 5 యూనిట్ల మొత్తం విద్యుత్ సామర్థ్యాన్ని పూర్తి చేసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన థర్మల్ పవర్‌ప్లాంట్ నల్లగొండ జిల్లాకే తలమానికమని భావించిన రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా పనులను వేగవంతం చేసిందన్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం 4.07 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా పవర్‌ప్లాంట్‌కు చేరుకున్న అయనకు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి(బిఎల్‌అర్) అధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. 4.20 గంటలకు ప్రత్యేక కాన్వాయ్ ద్వారా పైలాన్‌కు చేరుకొని అవిష్కరించి యూనిట్ రెండు ద్వారా 800 మెగావాట్ల విద్యుత్‌ను ప్రారంభించి గ్రిడ్ అనుసంధానం చేశారు. మొత్తం 53 నిమిషాలు పవర్ ప్లాంట్‌లో గడిపిన అయన 40 నిమిషాలు ప్లాంట్‌లోనే ఉండి అన్ని విషయాలను సీఈ సమ్మయ్యతో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భారీ భద్రతతో అయన పర్యటన సాయంత్రం 5గంటలకు ముగిసింది.

ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కమల్లు, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదరం రాజనర్సింహా, తుమ్మల నాగేశ్వంరావు, నల్లగొండ ఎంపి కుందూరు రఘువీర్‌రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, టిఎస్‌ఎస్పిడిసిఎల్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డిసిసి అధ్యక్షులు కేతావత్ శంకర్‌నాయక్, పగిడి రామలింగయ్యయాదవ్, దీరావత్ స్కైలాబ్‌నాయక్, గాయం ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను రాష్ట్ర కమిషనర్‌గా నియమించాలి

**హైదరాబాద్, డిసెంబరు 7 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్ర దివ్యాంగుల కమిషనర్‌గా, డైరెక్టర్‌గా నియమించాలని డిఎస్డి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వల్లభనేని ప్రసాద్ బి భారతి, దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఆద్యక్షుడు కాటమోని వెంకటేష్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్రములో దివ్యాంగుల జనాభా 20 లక్షల పైగా వున్నరని, వికలాంగులా, సకలాంగుల సమాన స్థాయి 2016 చట్టం అమలు చేయకపోవడం అన్యాయమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వేంటనే స్పందించి రాష్ట్ర కమిషనర్, డెరిక్టర్ గాను, 33 జిల్లాలో జిల్లా సంక్షేమ శాఖ అదికారులుగా దివ్యాంగులను నియమించాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ తల్లి రూపం మార్పుపై హైకోర్టులో పిటీషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబరు7:** సచివాలయంలో నూతనంగా తెలంగాణ తల్లి విగ్రహ రూపంపై వివాదం నెలకొంది. సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్, రచయిత జూలూరీ గౌరీశంకర్ హైకోర్టులో శనివారం ప్రజా ప్రయోజన పిటీషన్ దాఖలు చేశారు. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేయడంపై పిటీషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల మనోభావాలతో కూడుకున్న తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడం తగదని ఆయన పేర్కొన్నారు. సచివాలయంలో ఈ నెల 9వ తేదీన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో హైకోర్టును కోరారు.

## ప్రజాధనాన్ని దోచుకుంటున్న వారిని చట్టసభలకు..

### కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు ఆవేదన

**శంషాబాద్. డిసెంబరు 7 ప్రభాతవార్త:** సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్న వారిని ఆయా ప్రభుత్వాలు జైళ్లకు పంపిస్తుంటే ప్రజలు కూడా ప్రజాధనాన్ని దోచుకుంటున్న వారిని చట్టసభలకు పంపుతున్నారని కొత్తగూడెం శాసనసభ్యులు కూనమనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రెండు రోజుల రాష్ట్ర సదస్సు శనివారం శంషాబాద్ నిర్వహించగా ఈ కార్యక్రమానికి సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అజీజ్ పాషా. పుస్తకాల నర్సింగ్ రావు. పశ్య పద్మ. ఓరుగంటి యాదయ్య. బుద్ధులు జంగయ్య. రాళ్ల గూడెం జంగయ్య. నర్రా గిరినాథ్. తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల పెన్షన్‌ను 6వేలకు పెంచాలి

### మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, డిసెంబరు 7,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా వికాలాంగుల పెన్షన్‌ను 6వేలకు పెంచాలని అలాగే చేయూత పెన్షన్ 2వేల నుంచి 4వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వికలాంగుల హక్కుల పోరాట సమితి,మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిల సంయుక్త ఆధ్వర్యంలో అఖిలపక్ష,దివ్యంగ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.

## లాభాల్లో రిటైర్డు కార్మికులకు రూ.33 కోట్ల వాటా

### 12న ఖాతాల్లో సింగరేణి జమ

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** సింగరేణిలో పని చేసి పదవీ విరమణ పొందిన కార్మికులకు 33 కోట్ల రూపాయల మేల లాభాల్లో వాటా మంజూరైంది. ఈ సొమ్ము ఈ నెల 12న కార్మికుల ఖాతాల్లో జమ కానుంది.

## పతాక దినోత్సవ నిధికి సిఎం రేవంత్ రెడ్డి రూ.1 లక్ష విరాళం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబరు7:** సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.1 లక్ష విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కల్నల్ పి.రమేశ్ కుమార్, ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు శ్రీనేష్ కుమార్ నోరి, అకౌంట్స్ అధికారి ఎ.నరోత్తమ్ రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కెప్టెన్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ అస్లాం పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

## 26 కిలోల డ్రై గంజాయి, ఒక కారు, రెండు బైకులు, 4సెల్‌ఫోన్లు స్వాధీనం

### ఒడిశాకు చెందిన నలుగురు, నగరానికి చెందిన ముగ్గురు నిందితులు



శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో గంజాయి ముఠాను అరెస్ట్ చేసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పేట్‌బషీరాబాద్ ఎసిపి రాములు, పాల్గొన్న సిఐలు శ్రీనాథ్, గంగాధర్, ఎస్‌ఓటి స్టాఫ్, స్థానిక ఎస్‌ఐలు, స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

**శామీర్‌పేట, డిసెంబరు 7, ప్రభాతవార్త:** మజీద్‌పూర్ వద్ద అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను మేడ్చల్ జోన్ ఎస్‌ఓటి పోలీసులు, శామీర్‌పేట పోలీసులు ముందస్తు సమాచారంతో దాడి చేసి పట్టుకున్నారు. ఏడు మంది గంజాయి ముఠాను అదుపులోకి తీసుకుని వారి నుంచి 26కిలోల డ్రై గంజాయి ప్యాకెట్లను, ఒక కారును, రెండు బైక్‌లను, నాలుగు సెల్‌ఫోన్లను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. శనివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో పేట్‌బషీరాబాద్ ఎసిపి రాములు విలేకరులతో మాట్లాడుతూ ఒడిస్సా నుంచి అక్రమంగ గంజాయిని నగరానికి తరలిస్తూ 6న నగర శివారు ప్రాంతం శామీర్‌పేట సమీపంలోని మజీద్‌పూర్‌కు తరలించిన అంతరాష్ట్ర ముఠాను పట్టు కున్నట్లు తెలిపారు. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మజీద్‌పూర్ భవార్చి హోటల్‌కు ఎదురుగా ఉన్న ఓపెన్ వెంఛర్‌లో గంజాయి ముఠా ఉన్నట్లు నమ్మదగిన సమాచారంతో మేడ్చల్ జోన్ ఎస్‌ఓటి పోలీసులు, శామీర్‌పేట పోలీసులు ప్రణాళికలు రూపొందించుకుని దాడి చేసి గంజాయి ముఠాను పట్టుకోవటం జరిగిందన్నారు. అయితే ఒక ఫోర్డ్ కారులో కుటుంబ సభ్యులుగా ఉన్నట్లుగా నటించి వారు కూర్చున్న సీట్ల కింద గంజాయి డ్రై ప్యాకెట్లు 14 (26కిలోలు) ఉండటంతో వాటిని పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. అయితే గంజాయిని సరఫరా చేస్తున్న వారిని, ఆ గంజాయిని తీసుకోవటానికి వచ్చిన రిసీవర్స్‌ను కూడ వీరిలో మొత్తం ఆరు మందితో పాటు ఒక మైనర్ ఉన్నట్లు తెలిపారు. ఒడిస్సాలోని మల్కన్‌గిరి జిల్లాకు చెందిన నయన్‌దాస్ (25), నగరంలోని దూల్‌పేట్‌కు చెందిన అనికేశ్ సింగ్ (25), రోహిత్ (28), దాల్‌వాలే లక్ష్‌రాజ్‌సింగ్ (19), ఒడిస్సా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లాకు చెందిన గీతా మండల్ (48), గీత ఆలియాస్ రిటా మిస్త్రీ (30)లు, మరొకరు మైనర్ ఉండగ వీరిలో గంజాయి సరఫరా చేస్తున్న వారు, రిసీవ్ చేసుకుంటున్న వారు ఈ ముఠాగా ఉన్నారని ఎసిపి వివరించారు. ఏడు మంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించటం జరుగుతుందన్నారు. వారి నుంచి మొత్తం సుమారు 15లక్షల 50వేల రూపాయల విలువ చేసే వాటిని స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. పోలీసులు విధి నిర్వాహణలో చాకచక్యంగా వ్యవరించి గంజాయి ముఠాను పట్టుకున్న శామీర్‌పేట పోలీస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌ను, ఎస్‌ఓటి ఇన్స్‌పెక్టర్ మేడ్చల్‌ను వారి బృందాన్ని అభినం దిస్తూ సిపి, డిసిపి సూచనల మేరకు రివార్డులు అందజేయటానికి కృషి జరుగుతుందన్నారు. ఎస్‌ఓటి డిసిపి డి.శ్రీనివాస్, అడిషనల్ డిసిపి శోభన్‌కుమార్‌ల, అడిషనల్ డిసిపి ఎస్‌ఓటి-2 ల పర్యవేక్షణలో గంజాయి ముఠాను వలపన్ని పట్టుకున్నట్లు ఎసిపి రాములు వివరించారు.

# సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తాం : మంత్రి సీతక్క, మహేష్‌కుమార్‌గౌడ్



పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సత్కరిస్తున్న ఐఎన్‌టియుసి నాయకులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), డిసెంబరు 7 ప్రభాతవార్త :** రాష్ట్రంలోనే ఎక్కువమంది ప్రజలకు ముఖ్యమైన సేవలందించే జీహెచ్‌ఎంసి ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించి న్యాయం జరిగేలా తమవంతు సంపూర్ణ కృషిచేస్తామని తెలంగాణ మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి దనసరి అనుసూయ సీతక్క, పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌లు భరోసానిచ్చారు. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో శనివారం సాయంత్రం ఐఎన్‌టియుసి ఆలిండియా ప్రెసిడెంట్ డా. జి.సంజీవరెడ్డి సభాధ్యక్షతన జరిగిన ఐఎన్‌టియుసి సదస్సుకు వీరు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రసంగించారు.

మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక ప్రజలకు అవసరమైన సేవలందిస్తున్న జీహెచ్ ఎంసిలో వెంటనే యూనియన్ గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గాంధీ, మోజస్, యాదగిరి, రాజు తది తరులు పాల్గొన్నారు. చివరిగా మహేష్‌కుమార్ గౌడ్‌ను ఘనంగా సత్కరించారు.

# యేడాది కాలంలో ఒక్క హామీని సరిగ్గా అమలు చేయలేదు

## కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 7 ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్-కాంగ్రెస్ పార్టీలవి ఒకే డిఎన్‌ఏ అని, ఒకే తాను ముక్కలు అని, పాలన వైఫల్యంలో కెసిఆర్, రేవంత్ రెడ్డి కవలపిల్లల్లాంటివారు అని కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి అన్నారు. శనివారం సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అనేక సంవత్సరాల పాటు పోరాటం చేశాం. అనేక బలిదానాలు జరిగాయి. సకలజనుల సమ్మె చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నాం కానీ, గతంలో కెసిఆర్ నాయకత్వంలో బిఆర్‌ఎస్ పార్టీ కుటుంబ, అహంకార, అవినీతి పాలనతో తెలంగాణ ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి యేడాది పూర్తవుతోందని, గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు 100 రోజుల్లో గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పారు. 420 హామీలు గుప్పించారని, యేడాది పాలన గడిచినా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సరిగ్గా అమలు చేయలేదన్నారు.

**భాగ్యనగరాన్ని మరో బంగ్లాదేశ్‌గా మార్చేందుకు కుట్ర: బండి సంజయ్‌కుమార్**

అర్బన్ నక్సల్స్ చేతిలో రేవంత్ సర్కార్ బందీ అయిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బండి సంజయ్‌కుమార్ కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌పై నిప్పులు చెరిగారు.

**పది నెలల్లోనే ప్రజల్లో రేవంత్ ప్రభుత్వం అభాసుపాలైంది: ఎంపి ఈటల రాజేందర్**

రాష్ట్రంలో పది నెలల్లోనే ప్రజల్లో రేవంత్ ప్రభుత్వం అభాసుపాలైందని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు.

**హామీలన్నింటిని అటకెక్కించింది: ఎంపి లక్ష్మణ్**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటిని అటకెక్కించిందని, ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యాసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు.

# డ్రగ్స్ స్మగ్లర్ల భరతం పట్టేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు

## ప్రత్యేక కోర్టుల మంజూరుకు హైకోర్టును కోరేందుకు నిర్ణయించిన సర్కారు

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ధృడ సంకల్పంతో వున్న సర్కారు నేరగాళ్లకు కఠిన శిక్షలు పడేందుకు, కేసుల విచారణ వేగంగా సాగేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని తాజాగా నిరయించిన నేపథ్యంలో ఇందుకు సం బంధించిన పనులను వేగంగా చేబట్టేందుకు సర్కారీ విభాగాలు కసరత్తులు చేయసాగాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుకుగానూ హైకోర్టును కోరేందుకు సర్కారు నిర్ణయించినట్లుగా తెలిసింది. అయితే డ్రగ్స్ స్మగ్లర్ల భరతం పట్టేందుకు, వారికి కఠిన శిక్షలు పడేలా చేసేం దుకు టిఆర్‌ఎస్ హయాంలో అంతకు ముందు ఉమ్మడి ఎపి హయాంలోనూ ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు ప్రస్తావన వచ్చినా ఇవన్నీ ఆచరణలో అమలుకాలేదు. ప్రస్తుతం డ్రగ్స్ కేసులను తీవ్రంగా పరిగణించడంతో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు హైకోర్టు సానుకూలంగా వ్యవహరించే వీలుందని న్యాయ, పోలీసు, అబ్కారీ విభాగాల అధికా రులు చెబుతున్నారు. మరోవైపు రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు, అబ్కారీ శాఖల మధ్య మరింత సమన్వయం వుండాల్సిన అవసరం వుందని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత సమాజంగా మార్చాలని సర్కారు నిర్ణయించడం మంచి ఆలోచనే అయినా ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు ఒక్క అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కు అన్నట్లుగా వుంది. రాష్ట్రంలో ఒకప్పుడు గుడుంబా అతిపెద్ద సమస్యగా వుండగా దీనిని చాలా వరకు నిర్మూలన చేసినా ఇప్పుడు దీని స్థానాన్ని గంజాయి ఆక్రమించడం కొత్త సమస్యకు దారితీసింది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలు గంజాయి డెన్‌లుగా మారాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఒకప్పటి గుడుంబా స్థావరాలన్నీ నేడు గంజాయి డెన్‌లుగా మారగా నాటి గుడుంబా డాన్‌లు ఇప్పుడు గంజాయి బాస్‌లుగా మారారు. ఇప్పుడు సిఎం రేవంత్ రెడ్డి మరోమారు డ్రగ్స్ కేసులను వేగంగా విచారించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో పోలీసు, అబ్కారీ శాఖ అధికారులు, న్యాయశాఖ అధికారులు ఉమ్మడిగా కలిసి ముందుకు వెళ్లాల్సి వుంది. దీనిపై ఈ మూడు శాఖలు ఉమ్మడిగా కార్యాచరణను రూపొందిస్తున్నారు. అన్నీ సవ్యంగా కుదిరితే రెండు వారాల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుపై తుది నిర్ణయం వెలువడే వీలుంది.ఇదే సమయంలో డ్రగ్స్ కట్టడికి అబ్కారీ, పోలీసు విభాగాలు ఉమ్మ డిగా ముందుకు సాగాల్సి వుంది. డ్రగ్స్ కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటయితే మాదకద్రవ్యాల నిర్మూలనలో ముందడుగు పడినట్లుగా చెప్పాలి.

## తెలుగు తప్పనిసరి అమలుకు గడువు పొడిగింపు

**హైదరాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో తెలుగు తప్పనిసరి చేస్తూ గత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలు గడువును పొడిగించారు. ఈ ఏడాది వరకు 9, 10వ తరగతి వారికి అమలు చేయడానికి అవకాశం కల్పించగా 10వ తరగతి విద్యార్థులకి వచ్చే ఏడాది 2025-26 విద్యా సంవత్సరం వరకు తెలుగు తప్పనిసరిగా అమలు చేయడం కోసం పాఠశాల విద్యశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

## తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం అవమానం:శశిధర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబరు7:** నాలుగు కోట్ల ప్రజల ఆత్మగౌరవానికి ప్రతికైనటువంటి తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగమాగం చేస్తున్నారని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి విమర్శించారు.ఏకంగా తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం అంటే అది నిజంగా తెలంగాణ అమరవీరులకు, తెలంగాణ ఉద్యమకారులకు జరిగిన తీవ్రమైనఅవమానంగానే భావిస్తున్నా మన్నారు. ఇలాంటి చిల్లర చేష్టలతో రాష్ట్రాన్ని పాలిస్తే తెలంగాణ చరిత్రలో రేవంత్ రెడ్డి పేరు విధ్వంసకారుడిగా మిగిలిపోవడం ఖాయమన్నారు.



శనివారం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

# నిరుపేదలకు విద్య, వైద్యం, నీడ అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం

## సంగెం మండంలో 4కోట్ల 80లక్షలతో నిర్మించే బీటీ రోడ్డుకు శంకుస్థాపన: మంత్రి శ్రీధర్‌బాబు

**సంగెం, డిసెంబరు 7, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు వైద్య, వైద్యం నీడను అందించాలన్నదే కాంగ్రెస్ ప్రజాప్రభుత్వ ద్యేయమని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సంగెం, గీసుగొండ మండలాల పరిధిలో గల కాక తీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం లాటరీ పద్దతి ద్వారా నెంబర్ల ప్రకారం ప్లాట్లు కేటాయించడం కోసం అదేవిధంగా గొర్రె కుంటలోని బ్రాహ్మణ భవన కమ్యూనిటి హాల్‌ను ప్రారంభించడానికి మంత్రి శ్రీధర్‌బాబు టెక్స్‌టైల్ పార్కును సందర్శించారు. టెక్స్‌టైల్ పార్కులో మౌళిక వసతుల సదుపాయాల అభివృద్ధికి కల్పిస్తున్న పనుల్లో భాగంగా పది కోట్ల రూపాయల వ్యయంతో ఎమ్మెస్మీ పార్కు (మైక్రో మిని స్మాల్ ఇండస్ట్రీస్) రోడ్లు, డ్రైనీజీలు, మంచినీటి సరఫరా పనులకు రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని 863 ఆర్‌ఎన్‌ఆర్ లేఔట్ ప్లాట్లకు 58లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే వెటర్నరి హాస్పిటల్ తదితర అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డితో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్దన్నపేట శాసన సభ్యులు కేఆర్ నాగరాజు, రాష్ట్ర గిడ్డంగుల ఛైర్మన్ నాగేశ్వరరావు, వరంగల్ జిల్లా కూడ ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, నిర్మల జగ్గారెడ్డి, కలెక్టర్ సత్యశారద, పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ అధికార ప్రతినిధి జనగామ రమేష్, జిల్లా నాయకులు సోమిడి అంజన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, సంగెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు సొల్లేటి మాధవరెడ్డి, గీసుగొండ మండల అధ్యక్షుడు చాడ కొమురారెడ్డి, కందకట్ల నరహరి, మెట్టుపల్లి రమేష్, సంగెం మండల మాజీ ఎంపిపి బొమ్మగాని సౌందర్య, జిల్లా సంబంధిత శాఖల అధికారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వీడిన విశ్రాంత బ్యాంకు ఉద్యోగి మర్డర్ మిస్టరీ

## నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

### మట్టెవాడ పోలీసులను అభినందించిన సి.పి ఎసిపి

**వరంగల్ క్రైం ప్రభాతవార్త :** సమాజం పట్ల బాధ్యతతో ఉండాల్సిన ఓ యూట్యూబర్ డబ్బు మాయలో పడి క్షణికావేశంలో అత్యంత దారుణానికి ఒడిగట్టాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను శనివారం పోలీసులు వెల్లడించారు. మంగళవారం తెల్లవారుజామున రంగంపేటలోని ఓ గల్లీలో రోడ్డు పై ఓ కారు అనుమానాస్పదంగా నిలిచి ఉంది. స్థానికులు వెళ్లి చూడగా కారులో ఓ వ్యక్తి కాళ్లు, చేతులను తాళ్లతో కట్టేసి ఉన్నాడు. నిశితంగా పరిశీలించగా.. అతడు చనిపోయినట్టు స్థానికులు గ్రహించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా రంగప్రవేశం చేసిన పోలీసులు కారును పరిశీలించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడిని శ్రీనగర్ కాలనీకి చెందిన విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి వెలుగట్టి రాజా మోహన్‌గా గుర్తించారు. నిందితుడు జక్కుల శ్రీనివాసరావు తను అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద మృతుని తలపై రోకలి బండతో పలుమార్లు కొట్టి చంపి మృతిని కారులోనే వెనక సీటులో వేసుకొని రామన్నపేటలో రోడ్డు ప్రక్కకు కారు పార్కు చేసి వెళ్లిపోవడం జరిగింది. ఈ క్రమంలో హత్య చేసిన స్థలం వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోయినప్పటికి పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి వరంగల్ ఏసీపీ నందిరాం ఆధ్వర్యంలో వరంగల్ సబ్ డివిజన్ లోని క్రైమ్ పార్టీ.. తోపాటు ఆఫీసర్లను నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసి సుమారు 1000 సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించి నిందితుడుని పట్టుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మట్టెవాడ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ తుమ్మ గోపి, సబ్ ఇన్స్పెక్టర్ లు విట్టల్, నవీన్, సాంబయ్య, లచ్చయ్య సబ్ డివిజన్ కు సంబంధించిన క్రైమ్ పార్టీ సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా..డిసిపి సలీమా తో పాటు వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ అభినందించారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసిపి నందిరాం నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న టెక్నాలజీతో నేరం చేసిన నిందితులు ఎవరైనా పోలీసుల నుండి తప్పించుకోలేరని హెచ్చరించారు.

# ఎలర్జీ మందు తాగి విద్యార్థి ఆత్మహత్యాయత్నం

## ఆశ్రమోన్నత పాఠశాలలో సంఘటన: విచారణ చేపట్టిన అధికారులు



విచారణ చేపడుతున్న ఎస్‌ఐ గిరిధర్‌రెడ్డి

**గూడూరు, డిసెంబరు 7, ప్రభాతవార్త:** సీనియర్ విద్యార్థులు వేధింపులకు గురిచేస్తున్నారంటూ మనస్తాపానికి గురైన ఆరవ తరగతి ఈసం రుత్విక్ విద్యార్థి ఎలర్జీ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గూడూరులోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో శనివారం ఉదయం జరిగింది. ఆత్మహ త్యాయత్నానికి పాల్పడిన విద్యార్థిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తర లించి చికిత్స అందించే ప్రయత్నం చేస్తున్న తరుణంలో విషయం బయట పడింది. ఈ వ్యవహారం మండల కేంద్రంలో చర్చనియాంశంగా మారింది. సమా చారం అందుకున్న పోలీసులు, గిరిజన సంక్షేమశాఖ అధికారులు పాఠశా లను సందర్శించి జరిగిన సంఘటనపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసారు. మరోవైపు ఈ సంఘటనపై నంగారభేరి, విద్యార్థి సంఘాల నాయకులు కూడా స్పందించి భాధిత విద్యార్థితో మాట్లాడి ఈ సంఘటనకు భాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. సమాచారం అందుకున్న గూడూరు ఎస్ఐ గిరిధర్‌రెడ్డి, ఎటిడిఓ భాస్కర్‌లు వేరువేరుగా ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించి విచారణ జరిపారు. ఆసు పత్రికి వెళ్లి భాధిత విద్యార్థితో కూడా మాట్లాడి వాంగ్మూలం తీసుకున్నారు.

# పాలమూరులో స్వల్ప భూకంపం

## రిక్టర్ స్కేలుపై 3.0గా నమోదు

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 7 ప్రభాతవార్త:** గత రెండు రోజుల కింద తెలంగాణలోని పలు జిల్లాల్లో భూకంపంతో జనాలు భయాందోళనకు గురైన సంగతి తెలిసిందే. మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలం దాసరపల్లి గ్రామంలో మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో భూమి స్వల్పంగా కంపించినట్లు పలువురు స్థానికులు చెబు తున్నారు. తమ ఇళ్లల్లోని ప్లేట్లు ఇతర వస్తు సామాగ్రి కదలడం, పక్కకు జరగడం, కింద పడిపోవడం జరిగిందని సోషల్ మీడియాలో ఫోటోలు, వీడియోలు వైరల్ అయింది. వెంటనే కొంతమంది ఇండ్లలోనుంచి బయటకు పరుగులు తీసినట్లు స్థానికులు చెబుతున్నారు. రిక్టర్ స్కేలుపై 3.0గా నమోదు అయినట్లు అధికారులు చెబుతున్నారు. ఎక్కడ కూడా ఎలాంటి ఆస్తి నష్టం కానీ, ప్రాణ నష్టం కానీ జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# నేడే తెలంగాణ రచయితల సంఘ పదేళ్ల సాహిత్య సభలు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), డిసెంబరు 7 ప్రభాతవార్త :** తెలంగాణ రచయితల సంఘం పదేళ్ల సాహిత్య సభలు వైభవోపేతంగా ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో వైభవంగా విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డా. నందిని సిధారెడ్డి ఈ సాహిత్య సభలకు సంబంధించిన కరపత్రాలను రవీంద్రభారతిలో శనివారం సాయంత్రం ఆవిష్కరించి తెలిపారు.ఈ సందర్భంగా సిధారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వ సాహిత్యం వర్తమాన సందర్భం అనే అంశం మీద సభలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. నాళేశ్వరం శంకరం, ప్రధాన కార్యదర్శి డా. వి.శంకర్, జంటనగరాలశాఖ అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు, సంఘ బాధ్యులు డా. చెమన్, ఎరకల యాదయ్య, దాసరి మోహన్, రూప్‌కుమార్ డబ్బికార్, కొండపల్లి నిహారిని, రంగరాజు పద్మజ, గడ్డం సులోచన తదితరులు పాల్గొన్నారు.

# ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా దిల్ రాజు

**హైదరాబాద్,డిసెంబరు 7,ప్రభాతవార్త:** తెలుగు చలనచిత్ర నిర్మాత దిల్ రాజుకు తెలంగాణ ప్రభుత్వం కీలక పదవి కట్టబెట్టింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిఎఫ్‌డిసీ) ఛైర్మన్‌గా ఆయన్ని నియమిస్తూ రేవంత్ రెడ్డిసర్కార్ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీచేశారు. ఈ పదవిలో ఆయన రెండేళ్ల పాటు కొనసాగుతారు. కాగా తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి (ఫిల్మ్ ఛాంబర్) అధ్యక్షుడిగా గత ఏడాది జరిగిన ఎన్నికల్లో దిల్ రాజు ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల ద్వారా 2023- 25 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇక తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఎన్నో చిత్రాలను నిర్మించారు. భారీబడ్జెట్ సినిమాలు మాత్రమే కాకుండా చిన్న సినిమాలు నిర్మిస్తూ కొత్త వారికి కూడా అవకాశం కలిపించినట్లు చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు చెబుతున్నారు.

# పింక్ బాల్ టెస్టులో ఆస్ట్రేలియా దూకుడు




## తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 337 ఆలౌట్

### 308 స్కోరుతో 29 పరుగులు వెనుకబడిన భారత్

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో అడిలైడ్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో భారత్ ఓటమి దిశగా పయనిస్తోంది. రెండో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో భారత్ ఐదు వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. తొలి, రెండో రోజు కలిపి భారత్ 308 పరుగులు చేసింది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 337 పరుగులకు భారత్ ఇంకా 29 పరుగులు వెనుకబడి ఉంది. రిషబ్ పంత్ 28 పరుగులు, నితీశ్ కుమార్ 15 పరుగులతో క్రీజులో ఉన్నారు. మూడో రోజు ఆటలో వీరిద్దరు ఎంత సేపు క్రీజులో ఉంటారనే దానిపైనే మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది. ఇక 157 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన భారత్‌కు శుభారంభం దక్కలేదు. 7 పరుగులు చేసిన కేఎల్ రాహుల్ జట్టు స్కోరు 12 వద్ద కమిన్స్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. మరికాసేపటికే దూకుడుగా ఆడుతున్న యశస్వి జైస్వాల్ 24 పరుగులు చేసేటప్పటికి స్కాట్ బోలాండ్ బుట్టలో వేశాడు. విరాట్ కోహ్లి 11 పరుగులుచేసి మరోసారి విఫలం కాగా, కుదురుకున్న శుభ్‌మన్ గిల్ 28 పరుగులతో పాటు, కెప్టెన్ రోహిత్ శర్మ 6 పరుగుల పేలవ ప్రదర్శనతో స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరుకున్నారు. దీంతో భారత్ 105 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో రిషబ్ పంత్, నితీశ్ జోడి మరో వికెట్ పడకుండా రోజును ముగించింది. కాగా పింక్ బాల్ టెస్టులో ఆస్ట్రేలియా భారీ స్కోరు సంపాదించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 87.3 ఓవర్లలో 337 పరుగులకు ఆలౌటైంది.

దీంతో ఆసీస్‌కు 157 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఆసీస్ బ్యాటర్లలో ట్రావిస్ హెడ్ 141 బంతుల్లో 140 పరుగులు, 17 ఫోర్లు, 4 సిక్సర్లు చేసి భారీ శతకంతో చెలరేగాడు. మార్నస్ లబుషేన్ 64 పరుగులతో రాణించాడు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లు చెరో నాలుగు వికెట్లు తీశారు. నితీశ్ రెడ్డి, రవిచంద్రన్ అశ్విన్‌లు చెరో వికెట్ సాధించాడు. కాగా, భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకే ఆలౌటైంది. ఓవర్ నైట్ స్కోరు 86/1 రెండోరోజు తొలిఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా మరో 251 పరుగులు జోడించి మిగిలిన తొమ్మిది వికెట్లు కోల్పోయింది. మ్యాచ్ ఆరంభమైన కాసేపటికే ఓవర్‌నైట్ స్కోరుకు మరో పరుగు మాత్రమే జోడించిన నాథన్ మెక్‌స్వీనీ (39) ఔట్ అయ్యాడు. అలాగే స్మిత్ (2) కూడా పెవిలియన్‌కు చేరుకున్నాడు. వీరిద్దరిని బుమ్రానే ఔట్ చేశాడు. మరో ఓవర్‌నైట్ బ్యాటర్ లబుషేన్‌తో జత కలిసిన ట్రావిస్ హెడ్ భారత బౌలర్లపైకి ఎదురుదాడికి దిగాడు. నాలుగో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించి ప్రమాదకరంగామారిన ఈ జోడిని లబుషేన్‌ను ఔట్ చేయడం ద్వారా నితీశ్ రెడ్డి విడగొట్టాడు.

లబుషేన్ ఔటైనా కూడా హెడ్ ఏమాత్రం తగ్గలేదు. ఓ వైపు వికెట్లు పడుతున్నా మరోవైపు తనదైన శైలిలో పరుగుల వరద పారించాడు. ఈ క్రమంలో 111 బంతుల్లో శతకాన్ని అందుకున్నాడు. పింక్ బాల్ టెస్టుల్లో ఇది అతడికి మూడో సెంచరీ కావడం విశేషం. సెంచరీ చేసిన తరువాత కూడా అతడు అదే జోరును కొనసాగించాడు. ఆఖరికి మహ్మద్ సిరాజ్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు.




## టెస్టులో 5 లక్షల రన్స్ చేసిన తొలి జట్టుగా ఇంగ్లాండ్

**న్యూఢిల్లీ:** టెస్టు క్రికెట్ చరిత్రలో 5 లక్షల పరుగులు చేసిన తొలి జట్టుగా ఇంగ్లాండ్ రికార్డు నెలకొల్పింది. క్రికెట్‌కు పుట్టినిల్లు అయిన ఇంగ్లాండ్ జట్టు ఈ అరుదైన ఘనత సాధించింది. 147 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో ఏ జట్టుకు సాధ్యంకాని ఓ రికార్డును అందుకుంది. వెల్లింగ్టన్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఈ ఘనత అందుకుంది. ఇంగ్లాండ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 378 పరుగులు చేసింది. ఇంగ్లాండ్‌కు ఇది 1082 టెస్టు. ఇక ఇంగ్లాండ్ తరువాత ఆస్ట్రేలియా అత్యధిక పరుగులు చేసింది. 4,28,868 పరుగులతో రెండో స్థానంలో ఉంది. ఇక భారత్ విషయానికి వస్తే.. 2,78,751 పరుగులతో ఈ జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. అలాగే టెస్టుల్లో అత్యధిక సెంచరీలు సాధించిన రికార్డు ఇంగ్లాండ్ పేరిటే ఉంది. ఇంగ్లాండ్ బ్యాటర్లు ఇప్పటి వరకు 929 సెంచరీలు నమోదు చేశారు. ఆ తరువాత ఆస్ట్రేలియా అత్యధికంగా 592 సెంచరీలతో రెండో స్థానంలో ఉంది. ఇక భారత బ్యాటర్లు 552 శతకాలు బాదారు. కాగా మ్యాచ్ విషయానికి వస్తే ఇంగ్లాండ్ మొదట బ్యాటింగ్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 280 పరుగులు చేసింది. అనంతరం కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఇంగ్లాండ్ కు 155 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఆ తరువాత రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లాండ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 378 పరుగులు చేసింది. జోరూట్ (73), బెన్‌స్టోక్స్ (35) లు క్రీజులో ఉన్నారు. బెన్ డకెట్ (92), జాకబ్ బెథెల్ (96) తృటిలో సెంచరీలను చేజార్చుకున్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ 533 పరుగుల ఆధిక్యంలో ఉంది.

## జాతీయ సబ్ జూనియర్ మహిళల హాకీలో ఛాంపియన్‌గా జార్ఖండ్



**న్యూఢిల్లీ:** జాతీయ సబ్ జనియర్ మహిళల హాకీ ఛాంపియన్‌షిప్‌లో జార్ఖండ్ టైటిల్‌ను సాధించింది. గత ఏడాది రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకున్న జార్ఖండ్ జట్టు ఈసారి మాత్రం విన్నర్స్ ట్రోఫీని సొంతం చేసుకుని రికార్డు సృష్టించింది. హోరాహోరీగా సాగిన తుది సమరంలో పుష్పాడాంగ్ సాధ్యంలోని జార్ఖండ్‌జట్టు 1-0 గోల్ తేడాతో కృష్ణ శర్మ నేతృత్వంలోని మధ్యప్రదేశ్ జట్టును ఓడించింది. ఆట 15వ నిమిషంలో ఎడమ వైపునుంచి జమునాకుమారి బంతితో దూసుకెళ్లి హెమ్రోమ్ లియోనికిపాస్ అందించింది. హెమ్రోమ్‌ఎలాంటి తప్పిదం చేయకుండా బంతిని లక్ష్యానికి చేర్చింది. దాంతో జార్ఖం డ్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్ జట్టు స్కోరును సమం చేసేందుకు విఫలయత్నం చేసింది. అయితే జార్ఖండ్ డిఫెన్స్ అత్యంత పటిష్టంగా ఉండటంతో చివరకు మధ్యప్రదేశ్‌కు ఓటమి తప్పలేదు. కాగా గత ఏడాది ఫైనల్లో హారియాణా చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన జార్ఖండ్ ఈ సారి మాత్రం టోర్నీ మొత్తం పకడ్బందీ ఆట తీరుతో అదరగొట్టింది. టోర్నీ మొత్తంలో ఒక్క మ్యాచ్‌లోనూ ఓడని జార్ఖండ్ ప్రత్యర్థి జట్లకు ఒకే ఒక్క గోల్ సమర్పించుకోవడం విశేషం. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో మిజోరం జట్టు 4-3 గోల్స్ తేడాతో ఒడిశా జట్టుపై గెలిచింది.

## ప్రొకబడ్డీలో తమిళ్ తలైవాన్ 6వ విజయం




### చిత్తుగా ఓడిన గుజరాత్ జెయింట్స్

**న్యూఢిల్లీ:** ప్రొకబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్లో తమిళ్ తలైవాస్ జట్టు ఆరో విజయం నమోదు చేసింది. ఈ పోరులో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన తలైవాస్ 40-27 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్పై విజయం సాధించింది. తలైవాస్ తరఫున మోయిన్ షఫాఘి 13 పాయింట్లతో సత్తా చాటగా, సౌరభ్, హిమాన్షు చెరో 7 పాయింట్లు సాధించారు. గుజరాత్ జెయింట్స్ తరఫున హిమాన్షు 11 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. తాజా సీజన్లో 16 మ్యాచ్ ఆడిన తమిళ్ తలైవాస్ 6 విజయాలు, 9 పరాజయాలు, ఒక టైతో 38 పాయింట్లు సంపాదించింది. ప్రస్తుతం తలైవాస్ తొమ్మిదోస్థానంలో ఉంది. మరోవైపు గుజరాత్ 16 మ్యాచ్లో పదో పరాజయం మూటగట్టుకుంది. తదుపరి జరిగిన రెండో మ్యాచ్‌లో హారియాణా స్టీలర్స్ 42-36 తేడాతో పట్నా పైరేట్‌సను చిత్తు చేసింది. హారియాణా జట్టు తరఫున శివమ్ 11 పాయింట్లు, మొహమ్మద్ రెజా 9 పాయింట్లు సాధించగా, సంజయ్ ధుల్, వినయ్ చెరో 5 పాయింట్లు ఖాతాలో వేసుకున్నారు. ఇక పట్నా తరఫున దేవాంక్ 13 పాయింట్లతో పోరాడాడు. ఓవరాల్గా ఇరు జట్లు రెయిడింగ్లో చెరో 19 పాయింట్లు సాధించగా, డిఫెన్స్‌లో సత్తా చాటిన స్టీలర్స్ విజయాన్ని ఖరారు చేసుకుంది. ఈ సీజన్లో 17 మ్యాచ్‌లు ఆడిన స్టీలర్స్ 13 విజయాలు, 4 పరాజయాలతో 67 పాయింట్లు సాధించింది. తమ అగ్రస్థానాన్ని పటిష్టం చేసుకుంది. పట్నా పైరేట్స్ 53 పాయింట్లతో మూడోస్థానంలో ఉంది.

## వాణిజ్యం

## బంగారంపై కేంద్ర బ్యాంకుల మోజు

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** ఈ యేడాదిలోనే సెంట్రల్ బ్యాంకులు 694 టన్నుల బంగారాన్ని కొన్నాయని డబ్ల్యూజీసీ నివేదిక చెబుతోంది. అందులో మన ఆర్బీఐ ఒక్కటే 77టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. ఆ తర్వాత టర్కీ 72 టన్నులు, పోలెండ్ 69 టన్నుల బంగారం కొన్నాయి. 2024లో అత్యధికంగా బంగారం కొనుగోలుచేసిన ప్రపంచ దేశాల కేంద్ర బ్యాంకుల్లో నేషనల్ బ్యాంక్ ఆఫ్ పోలాండ్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ టర్నీ, పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా టాప్‌లో ఉన్నాయి. గత సెప్టెంబర్ నెల చివరి నాటికి రిజర్వ్‌బ్యాంక్ వద్ద ఉన్న మొత్తం బంగారం నిల్వల్లో 60శాతం అంటే 510.46 టన్నుల బంగారం దేశీయంగా నిల్వ ఉంది. మార్చి నెలతో పోలిస్తే ఈ పరిమాణం ఏకంగా102 టన్నులు పెరిగింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ వద్ద ఉన్న నిల్వలను ఇటీవలే మన దేశానికి తరలించింది ఆర్‌బీఐ. దీంతో దేశీయ నిల్వలు భారీగా పెరిగాయి. ఈ ఏడాది మార్చి నెలతో పోలిస్తే రిజర్వ్ బ్యాంక్ వద్ద బంగారం నిల్వలు ఏకంగా 38 శాతం మేర పెరిగాయి. ఇక విదేశాల్లో కూడా భారత్ గోల్డ్ నిల్వల్ని పెంచుతూ వస్తోంది. విదేశాల్లో కూడా ఉంచిన నిల్వలతో కలిపి మొత్తం 854.73 టన్నులుగా ఉన్నట్లు ఆర్బీఐ నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం తులం బంగారం ధర 24 క్యారెట్లకు రూ. 80 వేలు పలుకుతోంది. కేజీ 80 లక్షలరూపాయలు. ఒక టన్ను బంగారం దాదాపు 6కోట్ల80లక్షల కోట్లకు పైనే ఉంటుంది. బంగారం నిల్వల్లో అమెరికాటాప్‌ప్లేస్‌లో ఉంది. అమెరికా తర్వాత జర్మనీ, ఇటలీ ఫ్రాన్స్ ఉండగా, మనదేశం 8వ స్థానంలో ఉంది. అమెరికా దగ్గర 8వేల133టన్నుల గోల్డ్ రిజర్వ్ ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా గోల్డ్ ఎక్కువగా ఉన్న దేశాల్లో మనదేశం టాప్10లో ఉంది. ఇది కేవలం ప్రభుత్వం దగ్గరున్న లెక్కల ప్రకారంగా చూస్తే. కానీ మన ఇండియాలో ఉన్నంత బంగారం ప్రపంచ దేశాల్లో ఎక్కడాలేదు. బంగారమంటే అత్యంత క్రేజున్న దేశం మన దేశమే. మనకు పండగొచ్చినా, పెళ్లిళ్లు చేసినా, పార్టీలు జరిగినా అందులో బంగారం తప్పనిసరిగా ఉండాలి.



## భారీగా పెరిగిన బిట్‌కాయిన్

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** ఇటీవల బిట్ కాయిన్ పెరుగుదల ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులను విస్మయానికి గురి చేసింది. భారతీయ పెట్టుబడిదారులు ఇటీవల కాలంలో బిట్ కాయిన్స్‌లో పెట్టుబడికి ఆసక్తి చూపుతున్నారు. నవంబర్ 5, 2024న బిట్ కాయిన్ ధర 67,800 డాలర్లు అంటే సుమారు రూ.58 లక్షలు ఉంటే డిసెంబర్5 నాటికి బిట్ కాయిన్ ధర 1,02,639 డాలర్లకు సుమారు రూ. 88 లక్షలకు చేరుకుంది. బిట్ కాయిన్ ధర మునుపెన్నడూ లేని విధంగా కేవలం ఒక నెలలో 51 శాతం జంప్ చేయడం ఆశ్చర్యపరిచిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అమెరికాలో రాజకీయ, ఆర్థిక పరిణామాల నేపథ్యంలో బిట్ కాయిన్ ధర భారీగా పెరిగిందని పేర్కొంటున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఇటీవలి విజయం సాధించడంతో బిట్ కాయిన్స్‌లో పెట్టుబడికి ఇన్వెస్టర్లు ఎగబడ్డారు. ఎన్నికల సమయంలో ట్రంప్ ప్రో క్రిప్టోగా విస్తృతం ప్రచారం చేయడంతో ట్రంప్‌విజయంతో క్రిప్టోకరెన్సీ మార్కెట్‌లో కొత్త విశ్వాసాన్ని రేకెత్తించిందని వివరిస్తున్నారు. ఓ పెట్టుబడిదారుడు నవంబర్ 5న బిట్‌కాయిన్‌లో రూ. 1 లక్ష ఇన్వెస్ట్‌చేసిఉంటే ప్రస్తుతపెరుగుదలతో రూ.1,51,712 చేరుకుంది. అంటే ఒక నెలలో లాభం రూ. 51,712గా ఉంది. అంటే నెలలోనే 51.7శాతం రాబడి వచ్చింది. అలాగే రూ. 10 లక్షల పెట్టుబడిపై రూ. 5,17,120, రూ.50లక్షల పెట్టుబడిపైలాభం రూ.25,85,600. బిట్ కాయిన్ పెరుగుదల అనేది ట్రంప్ ఎన్నికల విజయంతో ఆధారపడిం ఉందని నిపుణులు చెబుతున్నారు. ట్రంప్ ఎన్నికతో బిట్ కాయిన్ అధిక లాభాలను అందించింది. క్రిప్టోకరెన్సీల కోసం అనుకూలమైన రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్‌ను ట్రంప్ గతంలో సూచించాడు. అందువల్ల అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఆయన విజయం క్రిప్టోకరెన్సీ మార్కెట్‌ను పెంచింది. డిజిటల్ ఆస్తులలో సంస్థాగత పెట్టుబడిని ప్రోత్సహిస్తూ ట్రంప్ పరిపాలన వ్యాపార స్నేహ పూర్వకంగా ఉంటుందని భావిస్తున్నారు. క్రిప్టో అనుకూల ప్రభుత్వం కఠినమైన నిబంధనలకు సంబంధించిన ఆందోళనలను తగ్గించి, మార్కెట్ సెంటిమెంట్‌ను పెంచుతుంది.



## విదేశీ కరెన్సీ కళకళ

**ముంబై, డిసెంబరు 7:** ఎట్టకేలకు భారత విదేశీ మారక ద్రవ్య నిల్వలు మళ్లీ పెరిగాయి. వరుసగా గత 8 వారాలుగా విదేశీ నిల్వలు తగ్గుతుండగా, నవంబర్ 29తో ముగిసిన వారానికి విదేశీ మారకపు నిల్వలు పెరిగాయి. ఆ వారంలో 1.51 బిలియన్ డాలర్లు (రూ.12,500 లక్షల కోట్లు) పెరిగిన విదేశీ నిల్వలు 658.091 బిలియన్ డాలర్లు (రూ.55.27 లక్షల కోట్లు)కు చేరాయి. ఆ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విదేశీ మారకపు నిల్వలకు సంబంధించిన వివరాలను వెల్లడించింది. అంతకు ముందు నవంబర్ 22తో ముగిసిన వారం భారత విదేశీ నిల్వలు 1.31 బిలియన్ డాలర్లు తగ్గి 656.582 బిలియన్ డాలర్లుగా ఉంది. సెప్టెంబర్ చివర్లో ఫారెక్ట్ 704.885 బిలియన్ డాలర్ల ఆల్ టైమ్ హై స్థాయికి చేరింది. ఆ తర్వాత క్రమంగా విదేశీ మారకపు నిల్వలు తగ్గుతూ వచ్చాయి. నవంబర్ 22తో ముగిసిన వారానికి వరుసగా 8వ వారం కూడా ఫారెక్ట్ నిల్వలు క్షీణించాయి. రూపాయి విలువ పతనాన్ని నిరోధించే దిశగా ఆర్బీఐ తీసుకున్న కీలక నిర్ణయాలు ఫలించడంతో ఎట్టకేలకు నవంబర్ 29తో ముగిసిన వారంలో విదేశీ నిల్వలు పెరిగాయి. కాగా నవంబర్ 29తో ముగిసిన వారంలో విదేశీ నిల్వల్లో సింహ భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 2.06 బిలియన్ డాలర్లు పెరిగి568.85 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది భారత విదేశీ మారకపు నిల్వలు పెరిగేందుకు దోహదపడింది. అలాగే పసిడి నిల్వలు 595 మిలియన్ డాలర్లు తగ్గి 66.979 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఆర్బీఐ తెలిపింది.




## ఇన్‌యాక్టివేట్ అకౌంట్లపై బ్యాంకులకు ఆర్‌బిఐ ఆదేశాలు

**ముంబై, డిసెంబరు 7:** బ్యాంకుల విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎప్పటికప్పుడు కీలక అప్‌డేట్స్ అందిస్తూనే ఉంటుంది. బ్యాంకుల విషయంలో కొత్త కొత్త నియమ నిబంధనలు తీసుకువస్తుంటుంది. చాలా మంది బ్యాంకు ఖాతాలను సరిగ్గా నిర్వహించకుంటే బ్యాంకులు అలాంటి ఖాతాలను డీయాక్టివేట్ చేస్తుంటుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఆర్బీఐ బ్యాంకులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకుల డీయాక్టివ్ ఖాతాలను మళ్లీ యాక్టివేట్ చేయాలని ఆదేశించింది. కేవైసీ పూర్తికాకపోవడం వల్ల కొంతమంది ఖాతాదారుల ఖాతాలు, ప్రాథమిక లోపాల కారణంగా కొందరి ఖాతాలు మూతపడ్డాయని ఆర్బీఐ డిసెంబర్ 2న నోటిఫికేషన్ జారీ చేసింది. వీలైనంత త్వరగా వాటన్నింటినీ యాక్టివేట్ చేయాలని ఆర్బీఐ బ్యాంకులకు సూచించింది. విశేషమేమిటంటే.. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పదవీ కాలానికి ఇదే చివరి సమావేశం కావడం. ఆ తర్వాత ఫిబ్రవరిలో జరిగే సమావేశంలో కొత్త గవర్నర్ వస్తారు. ప్రస్తుతం ఆర్‌బీఐ రెపో రేటు 6.5శాతంగా ఉంది. మే 2022 నుండి ఫిబ్రవరి 2023 వరకు, ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి రిజర్వ్ బ్యాంక్ ఎంపీసీ రెపో రేటును మొత్తం 2.50 శాతం పెంచింది. ఈసారి ఎంపీసీ వడ్డీరేట్ల తగ్గింపు తమకు ఊరటనిస్తుందని సామాన్య ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఖాతాలను ఎలా యాక్టివేట్ చేయాలి. బ్యాంక్ ప్రకారం.. కస్టమర్‌లు ఈ దశలను అనుసరించడం ద్వారా వారి డార్మిటరీ ఖాతాలను తెరవవచ్చు. ముందుగా మీరు బ్యాంకు శాఖకు వెళ్లి మీ సంతకంతో దరఖాస్తును సమర్పించాలి. ఆ తర్వాత గుర్తింపు, చిరునామా స్వీయధృవీకృత రుజువునుసమర్పించండి. ఇలాచేయడం ద్వారా మీ ఖాతా యాక్టివేట్ చేస్తారు. ఆ తర్వాత మీ లావాదేవీలు యధావిధిగా నిర్వహించుకోవచ్చు. మీరు మీ కేవైసీ సంబంధిత పత్రాలను సమర్పించాలి. ఆ తర్వాత మీ ఖాతా యాక్టివేట్ అవుతుంది. దాని కోసం మీరు ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం ఖాతా యాక్టివేషన్ కోసం ఏ బ్యాంకు కూడా ఛార్జీ విధించదు.




## ఎంఎస్‌ఎంఇలకు సులభంగా రుణ వితరణ

**న్యూఢిల్లీ, డిసెంబరు 7:** బ్యాంకులు పొందడంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్‌ఎస్‌ఎంఈలు) అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఎంఎస్‌ఎంఈలకు ప్రత్యామ్నాయ రుణ వితరణ నమూనాలను పరిశీలించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్టు ప్రకటించింది. ప్రతిపాదిత పారిశ్రామిక పట్టణాల్లో ఎంఎస్‌ఎంఈలకు స్థలాలు కేటాయిస్తామన్నారు. బ్యాంకు రుణాల విషయంలో ఉన్న ఏంటో చెప్పండి. అధిక తనఖాలు కోరుతున్నాయా? ఎగుమతుల రుణ హామీ కార్పొరేషన్ (ఈసీజీసీ) రుణం, బ్యాంక్‌లు తనఖా కోసం అడుగుతున్నాయా? స్పష్టమైన సమాచారం పంచుకుంటే దాన్ని బ్యాంకుల దృష్టికి తీసుకెళ్లడం, ఇప్పటికీ బ్యాంకులకు వెళ్లి రుణాలు తీసుకునేందుకు అధిక శాతం ఆసక్తి చూపిస్తున్నారు. అయినప్పటికీ ప్రత్యామ్నాయ రుణ నమూనాల పట్ల అనుకూలంగా ఉంటాం అని గోయల్ ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో చెప్పారు. ఎంఎస్‌ఈలు లేకుండా పెద్ద పరిశ్రమలు మనుగడ సాగించలేవని వాణిజ్య మంత్రి గోయల్ పేర్కొన్నారు. కనుక వాటి కంటూ ప్రత్యేకంగా స్థలాలు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. మహారాష్ట్రలోని శంభాజీనగర్‌లో పెంద్రాబిడ్కిన్ పారిశ్రామిక టౌన్‌షిప్‌లో టయోటా రూ.20,000కోట్లు పెట్టుబడులు పెడుతోంది. ఈప్రాజెక్ట్‌ను అనుబంధంగా సుమారు 100 ఎంఎస్‌ఎంఇల అవసరం ఉంటుంది వివరించారు.




## జపాన్ కంపెనీల హవా

**టోక్యో, డిసెంబరు 7:** కొరియన్, చైనా బ్రాండ్ల దెబ్బకు భారత్‌లో జపాన్‌కంపెనీ ఉత్పత్తుల విక్రయాలు గణనీయంగా తగ్గిపోయాయి. ఇటీవల కాలంలో జపాన్ లో నడుస్తున్నవిధానాలవల్ల తిరిగి ఇండియా వాటి ఉత్పత్తుల అమ్మకాలు పుంజుకుంటున్నట్లు కంపెనీలను భర్తీ చేశాయి. సోనీ, పానాసోనిక్, హిటాచీ వంటి జపాన్‌ఎలక్ట్రానిక్ బ్రాండ్‌లకు భారత్‌లో మంచి ఆదరణ ఉంది. గానీ కొరియన్, చైనా బ్రాండ్ల దెబ్బకు వాటి అమ్మకాలు స్థానికంగా తగ్గిపోయాయి. దానితో జపాన్ కంపెనీలు కొత్త విధానాలను అమలు చేస్తూ తిరిగి వాటి ఉత్పత్తుల అమ్మకాలను పునరుద్ధరిస్తున్నాయి. ఎక్కువ మార్జిన్‌లు ఉండే ఉత్పత్తులు, బిగ్‌స్క్రీన్ టీవీలను విక్రయించడం, తక్కువ మార్జిన్‌లు ఉంటే వాటిని నిలిపేయడం వంటి విధానాలను పాటిస్తున్నారు. ప్రధానంగా జపాన్ కంపెనీలు ఇండియాలో టెలివిజన్లు, రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనర్లు, ఇతర గృహోపకరణాలను విక్రయిస్తున్నాయి. పానాసోనిక్ కంపెనీ ఉత్పత్తి అమ్మకాలు ఈ ఆర్థిక సంవత్సరం మొదటి భాగంలో పెరిగాయి. దాదాపు ఆరేళ్లపాటు వృద్ధి, అమ్మకాల విషయంలో తిరోగమన పథంలో ఉన్న కంపెనీ ఉత్పత్తులు ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో 30పైగా పుంజుకున్నాయి. సోనీఇండియా గత ఎనిమిదేళ్లలో ఈసారి అత్యుత్తమ నికరలాభాన్ని నమోదు చేసింది. సోనీబ్రావియా టెలివిజన్ల అమ్మకాల్లో 20కంటేఎక్కువ వృద్ధిని సాధించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో సోనీ అమ్మకాలు రూ.7,663కోట్లుగా ఉన్నాయి.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.